# సూళ్లూరుపేటలో గంజాయి స్మగ్లర్ల అరెస్ట్

## 14 లక్షల విలువైన గంజాయి స్వాధీనం



సూళ్లూరుపేట, జులై 12 ప్రభాతవార్త

సూళ్లూరుపేట జాతీయ రహదారిపై ఉన్న కోటపోలూరు జంక్షన్ వద్ద గంజాయి కారులో అక్రమంగా రవాణా చేస్తున్న ఇద్దరు స్మగ్లర్లను శనివారం సూళ్లూరుపేట పోలీసులు చాకచక్యంగా వలపన్ని పట్టుకున్నారు. డిఎస్పీ చెంచుబాబు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. వోక్స్‌వ్యాగన్ పోలో కారులో 70 కేజీల 560 గ్రాముల గంజాయిని అక్రమంగా రవాణా చేస్తుండగా కారుతో పాటు రవాణా చేస్తున్న తమిళనాడుకు చెందిన టి.బిబిన్, జె.రోహన్ అనే ఇద్దరిని అరెస్టు చేశారు. వీరి వద్ద నుంచి రెండు సెల్‌ఫోన్లు, వోక్స్‌వ్యాగన్ పోలో కారును స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన గంజాయి విలువ 14 లక్షల 11 వేల 200 రూపాయలు ఉంటుందని డిఎస్పీ తెలిపారు. పట్టుబడిన బిబిన్ తమిళనాడులో గంజాయి కేసులో, మరొక చోరీ కేసులో నిందితుడిగా ఉన్నట్లు తెలిపారు. రెండో నిందితుడు రోహన్ రెండు హత్య కేసులు, మూడు గంజాయి కేసులు, ఆరు రాబరీ కేసుల్లో నిందితుడిగా ఉన్నాడని డిఎస్పీ తెలిపారు. వీరిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు. తిరుపతి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశాలతో నాయుడుపేట డిఎస్పీ జి.చెంచుబాబు పర్యవేక్షణలో, సూళ్లూరుపేట సిఐ ఎం.మురళీకృష్ణ, ఎస్‌ఐలు వి.బ్రహ్మనాయుడు, కె.కొండప్పనాయుడు, ఎఎస్‌ఐ శ్రీకుమార్‌రెడ్డి, కానిస్టేబుళ్లు రాఘవరాజు, సురేష్‌లు గంజాయి స్మగ్లర్లను పట్టుకోవడంలో చొరవ చూపించారు. వీరిని డిఎస్పీ చెంచుబాబు అభినందించారు.


# తిరుపతి - చిత్తూరు



తెలుగు జాతీయ దినపత్రిక

వార్త




### పేదవాడికి కడుపు నింపడమే

# సిఎం చంద్రబాబు ఆశయం

### మంత్రులు మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, గొట్టిపాటి రవికుమార్‌లు



గంగాధరనెల్లూరు, జులై 12 ప్రభాతవార్త:

ప్రతి పేదవాడికి కడుపు నింపడమే ఆశయంగా సిఎం నారా చంద్రబాబునాయుడు రాష్ట్ర వ్యాప్తంగా అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేస్తున్నారని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి, జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌లు అన్నారు. జిడినెల్లూరు ఎంపిడిఓ కార్యాలయ ఆవరణలో శనివారం మంత్రులు రాంప్రసాద్‌రెడ్డి, గొట్టిపాటి రవికుమార్, ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, ప్రభుత్వ విప్ డాక్టర్ విఎం థామస్‌లు అన్న క్యాంటీన్ నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ రాష్ట్రంలోని ఏ పేదవాడు పట్టెడు అన్నం లభించక కడపు నింపుకోలేని వారు వుండకూడదని భావించి సిఎం చంద్రబాబునాయుడు ప్రతి నియోజకవర్గంలో అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించి రాష్ట్ర చరిత్రలో అన్నదాతగా సిఎం నిలిచిపోనున్నారన్నారు. ఈ కార్యక్రమం అనంతరం రాష్ట్ర మంత్రులు నెల్లేపల్లి గ్రామంలో నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంకు హాజరై ప్రతి ఇంటి గడప ఎక్కి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించి కరపత్రాలు అందజేశారు. వైఎస్ జగన్ అరాచక పాలన నుండి రాష్ట్ర ప్రజలను రక్షించిన సిఎం నారా చంద్రబాబునాయుడుకు మరోసారి మద్దతు ఇచ్చి సిఎంను చేస్తామని ఈ సందర్భంగా ప్రజలు మంత్రులతో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు స్వామిదాస్, నాయకులు కృష్ణమనాయుడు, శ్రీధర్‌నాయుడు, దేవాసుందరం, చల్లగుండ్ల దీపక్ చౌదరి, రాంబాబురెడ్డి, ప్రసాద్‌నాయుడు, చెర్లోపల్లి బాబు, ప్రకాష్, గోపి, జ్యోతివయాదవ్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి

# మాజీ డ్రైవర్ దారుణ హత్య



మృతుడు రాయుడు

### చెన్నైలో లభించిన మృతదేహం: చెన్నై పోలీసులు కేసు నమోదు
### ఇన్‌చార్జి వినూతతో పాటు భర్త చంద్ర, మరి ముగ్గురి అరెస్టు
### ఎందుకు హత్యచేసారు? తెర వెనుక ఏం జరిగింది? కేసు ఆంధ్రాకు బదిలి చేస్తారా?

**శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రం 2019 వరకు ప్రశాంత వాతావరణానికి నిలయం.అయితే 2019 తరువాత వాతావరణం మారింది.దాడులు,దౌర్జన్యాలకు నిలయంగా మారింది.రౌడీయిజం పెచ్చరిల్లింది. ఏ సమయంలో ఏం జరుగుతుందో అనే భయం ప్రజల్లో చోటు చేసుకుంది.ఇటీవల ఏరియా ఆసుపత్రిలో జరిగిన ఓ సంఘటనతో శ్రీకాళహస్తి ప్రజలు ఉలిక్కి పడ్డారు. ఏం జరుగుతుంది? ఎందుకు ఇలా జరుగుతుందనే అంశం చర్చనీయాంశంగా మారింది. దీనికి తోడు శ్రీకాళహస్తి జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి కోట వినూత కు చాలా కాలంగా డ్రైవర్‌గా పనిచేసిన శ్రీనివాసులు అనే రాయుడు చెన్నైలో శవంగా కనబడటం, అది హత్య అని తేలటంతో శ్రీకాళహస్తి జనం భయభ్రాంతులౌతున్నారు.ఈ కేసులో ఆ పార్టీ నాయకులను అరెస్టు చేయటంతో ఈ హత్య రాజకీయంగా జరిగిందా? అనే చర్చ చోటుచేసుకుంది.**




వినూత | కోట చంద్ర | గోపి | షేక్ థాసన్ | శివకుమార్

శ్రీకాళహస్తి,జూలై 12 ప్రభాతవార్త

శ్రీకాళహస్తిలో హత్యారాజకీయం కూడా మొదలైంది. ఒకనాడు ప్రశాంత వాతావరణంలో సాగిన నియోజకవర్గంలో నేడు రౌడీయిజం, హత్యారాజకీయాలకు తెరతీసినట్లు అయ్యింది. రాయుడు హత్యకేసులో చెన్నై పోలీసులు అనుమానితులుగా ఉన్న శ్రీకాళహస్తి నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి కోట వినూత,ఆమె భర్త కోట చంద్ర, వారితో పాటుదస్తర్ సాహెబ్, గోపి,శివకుమార్‌లపై ఆరోపణలతో అరెస్టు చేయటంతో రాజకీయ సంచలనం చోటు చేసుకుంది. దీనికి తోడు జనసే పార్టీ కార్యాలయం నుంచి తమిళనాడులో హత్య కేసులో అరెస్టు కాబడిన శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌చార్జి కోట వినూతను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారి చేయటంతో చర్చనీయాంశంగా మారింది.

#### ఎం జరిగింది?ఎలా జరిగింది?

శ్రీకాళహస్తి బొక్కసంపాళెంకు చెందిన శ్రీనివాసులు అనే రాయుడు చాలా కాలం జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కోట వినూత వద్ద డ్రైవర్‌గా పని చేసినట్లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న తమిళనాడు పోలీసులుపేర్కొన్నారు.అయితే ఈ నెల 8న రాయుడు శవమైన చెన్నై కూపం నది 4వ ప్రవేశ ద్వారం వద్ద ఉన్న ఎస్ ఎస్ నగర్ హౌసింగ్ బోర్డు నివాసాల వెనుక మృతదేహం లభ్యమైనట్లు పేర్కొన్నారు.అయితే మొదట గుర్తుతెలియని శవంగా భావించిన పోలీసులు మృతదేహంపై జనసేన సింబల్, కోట వినూత ట్యాటూ ఉండటంతో ఆరా తీసారు.సిసి ఫుటేజిలను పరిశీలించారు. కారు నెంబర్‌ను గుర్తించారు.అలాగే సిసి ఫుటేజీల ఆధారంగా ఎక్కడో హతమార్చి ఇక్కడ పడేశారనే నిర్ణయానికి వచ్చినట్లు పోలీసులు పేర్కొన్నారు. రెండు రోజుల పాటు ఆరా తీయగా ఆతను ఆంధ్ర ప్రదేశ్‌లోని తిరుపతి జిల్లా శ్రీకాళహస్తికి చెందిన వ్యక్తిగా గుర్తించారు.తమిళనాడు పోలీసులు జిల్లా ఎస్‌పి హర్షవర్ధన్‌రాజును కలసి కేసుకు సంబంధించి వివరించారు. ఆయన నిందితులది రేణిగుంట కాబట్టి ఆ పోలీసుల సహాయాన్ని తీసుకోవాలని సూచించారు. వారి విచారణలో రాయుడిది హత్య అనే నిర్ణయానికి వచ్చారు. సిసి పుటేజిల ఆధారంగా కేసు నమోదు చేసి ఎఫ్ఐఆర్ చేసినట్లు ప్రకటించారు. రాయుడుని ఎందుకు హత్య చేసినట్లు అనేది పట్టణంలో చర్చనీయాంశంగా మారింది.

#### చెన్నైకు పరుగులు తీసిన బంధువులు

శ్రీకాళహస్తి మండలం బొక్కసం పాళెంకు చెందిన శ్రీనివాసులు అనే రాయుడు కొంత కాలంగా ఇక్కడ లేదు. రేణిగుంటలోని తన సోదరి ఇంటి వద్ద ఉంటూ జనసేన శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌చార్జి వినూత కోట వద్ద డ్రైవర్‌గా పని చేస్తూ వచ్చారు.జూన్ 21న వినూత కోట తమ కార్యకలాపాలను, వ్యక్తిగత వివరాలను తమ ప్రత్యర్థులకు అందిస్తున్నాడనే ఆరోపణతో విధుల నుంచి తొలగిస్తూ ప్రకటన జారి చేసారు. రాయుడుతో తమ ఎలాంటి సంబంధం లేదని ప్రకటించారు.అయితే హత్యకు గురైన రాయుడు శవాన్ని కనుగొన్న పోలీసులు ఆధారాల్లో జనసేన నాయకులను అదుపులో తీసుకోవటంతో వారు హతమార్చే అంత తప్పు ఏంచేసాడనేది చర్చనీయంశంగా మారింది.

#### హత్య ఎక్కడ జరిగింది?

రాయుడును హతమార్చి చెన్నైలో పడేసారా? లేక మరెక్కడైనా హతమార్చి అంతు చిక్కకుండా పొరుగు రాష్ట్రంలలోన పడవేశారా? అనేది పోలీసుల విచారనలో తేలాల్సి ఉంది. అయితే శ్రీకాళహస్తిలో ఓ గోడౌన్లో రాయుడును చిత్రహింసలకు గురి చేసి హత్య చేసినట్లు తమిళనాడు పోలీసులు అనుమానిస్తున్నారు.ఈ నేపథ్యంలోనే కేసును బనాయించారు.కేసును ఆంధ్రాకు బదిలి చేయాలని తమిళనాడు పోలీసులపై వత్తిడి పెరిగింది.మరి ఏం జరుగుతుందో వేచి చూడాలి.అయితే నిందితులు ఏం జరిగిందనేది నోరు తెరిస్తే తప్ప ఎం జరిగిందో వాస్తవాలు తెలియదు. అయితే చెన్నై పోలీసులు మాత్రం ఐదుగురుపై కేసు నమోదు చేసారు.

## జనసేన నుంచి కోట వినూత బహిష్కరణ

*తిరుపతి విద్య జూలై 12 ప్రభాత వార్త:*



*శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్ చార్జీ వినూత కోట ను జనసేన పార్టీ నుంచి బహిష్కరించినట్లు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, జనసేన ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు హరిప్రసాద్ లు తెలిపారు. కొద్దికాలంగా పార్టీ కార్యకలాపాలకు వినూత దూరంగా ఉన్నట్లు ఎమ్మెల్యే నివాసంలో శనివారం మధ్యాహ్నం జరిగిన మీడియా సమావేశంలో వారు చెప్పారు.చెన్నైలో వినూతపై హత్యా నేర అభియోగం నమోదు కావడంతో ఆమెను పార్టీ నుంచి బహిష్కరించినట్లు వారు చెప్పారు.పార్టీ విధివిధానలకు,క్రమశిక్షణకు ఎవరైనా భిన్నంగా నడుచుకుంటే బహిష్కరణకు గురికావడం తథ్యమని జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ పలుసార్లు హెచ్చించారని వారు తెలిపారు.ఎవరైనా పార్టీ గీత దాటితే బహిష్కరణ తప్పదని వినూత కోట విషయంలో నిరూపమైందని వారు వెల్లడించారు.ఈ సమావేశంలో జనసేన నాయకులు రాజా రెడ్డి, రాజేష్ ఆచ్చారి,బాబ్జి, పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.*

## జనసేన కార్యకర్త హత్య బాధాకరం:ఎంఎల్‌ఏ

*శ్రీకాళహస్తి,జూలై 12 ప్రభాతవార్త*



*శ్రీకాళహస్తి నియోజకవర్గం ప్రశాంత వాతావరణంలో ఉండేది కానీ జనసేన కార్యకర్త శ్రీనివాసులు అనే రాయుడు హత్య బాధాకరమని శాసనసభ్యుడు బొజ్జల సుధీర్‌రెడ్డి వ్యాఖ్యానించారు.జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి వినూత వద్ద కొంత కాలంగా డ్రైవర్‌గా పని చేస్తున్న యువకుడు చనిపోవటం పట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేసారు. చెన్నైకు రెండు వాహనాల్లో మృతదేహాన్ని తరలించినట్లు పోలీసుల నుంచి సమాచారం ఉందని సుధీర్‌రెడ్డి అన్నారు.ఈ కేసులో వాస్తవాలను పరిశీలించిన పోలీసులు సమగ్రంగా సిసి పుటేజిల ఆధారంగా ఆరుగురిని అరెస్టు చేసినట్లు తెలిసిందన్నారు. దీనిని రాజకీయం చేయరాదని సుధీర్‌రెడ్డి అన్నారు.ఈ కేసుకు సంబంధించి చెన్నై పోలీసు కమిషనర్ అరుణ్ వివరాలు వెల్లడించారన్నారు. శ్రీనివాసులు అనే రాయుడును శ్రీకాళహస్తిలో హతమార్చి చెన్నైలో పడేశారని అనుమానిస్తున్నారని వివరించారు.హత్యకు వాడిన కారుతో కీలక ఆధారాలున్నాయని వివ రించినట్లు సుధీర్‌రెడ్డి అభిప్రాయపడ్డారు.*

# వైభవంగా పుష్పయాగం




వడమాలపేట, జూలై 12 ప్రభాతవార్త:

అప్పలాయగుంటలోని ప్రసన్న వెంకటేశ్వర స్వామివారికి శనివారం పుష్పయాగం వైభవంగా నిర్వహించారు. వేకువ జామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి అర్చకులు నిత్యకైంకర్యాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం 8.30 నుంచి 11 గంటల వరకు యాగశాలలో వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వెంకటేశ్వర స్వామివారి ఉత్సవ మూర్తులకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, పసుపు, చందనం, కొబ్బరినీళ్ళతో అభిషేకం చేశారు. మధ్యాహ్నం 2.40 గంటలనుంచి సాయంత్రం 5 వరకు పుష్పయాగం కన్నుల పండుగగా నిర్వహించారు. ఇందులో తులసి, చామంతి, గన్నేరు, మొగలి, మల్లె, జాజి సంపంగి, రోజా, కలువలు వంటి 11 రకాల పుష్పాలతో స్వామివారికి అభిషేకంచేశారు. చుట్టు పక్కల గ్రామాలనుంచి వచ్చిన భక్తులు స్వామివారికి పుష్పాలు సమర్పించి పుష్పయాగాన్ని కనులారా తిలకించి పులకించారు. సాయంత్రం 6 నుంచి 7.30 గంటల వరకు ఉభయ దేవేరుల సమేతంగా శ్రీనివాసుడు పెద్దశేషవాహనంపై కొలువుదీరి మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో హరీంద్రనాథ్, ఏఈవో దేవరాజులు, సూపరింటెండెంట్ శ్రీవాణి, ఆలయ అధికారి శివకుమార్, ఆలయ ప్రధాన అర్చకులు సూర్యకుమారాచార్యులు, రమణాచార్యులు, వేదపండితులు, టీటీడీ సిబ్బంది పాల్గొన్నారు.

# 30 సవర్లు బంగారు చోరీ

గూడూరు, జూలై 12, ప్రభాతవార్త



స్థానిక గమళ్లపాళెం ప్రాంతంలో నివాసముంటున్న శివయ్య అనే వ్యక్తి స్థానిక నివ మార్కెట్లో పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఆగస్టు నెలలో తన కుమార్తె వివాహం ఉండడంతో 30 సవర్ల బంగారు ఆభరణాలను ఇంట్లో భద్రప రిచి వున్నాడు. శనివారం వేకువన 3 గంటల సమయంలో శివయ్య కుటుంబ సభ్యులు పనుల నిమిత్తం బయటకు వెళ్లారు. అదే సమయంలో అతని కుమారుడు చైతన్య ఇంట్లోనే నిద్రిస్తున్నాడు. ఇదే సమయంలో కొందరు గర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోనికి ప్రవేశించి బీరువాను పగలగొట్టి అందులో ఉన్న 30 సవర్ల బంగారు ఆభరణాలను అపహరించుకు వెళ్లారు. ఉదయం చైతన్య నిద్రలేచి చూసే సమయానికి చోరీ జరిగినట్లు చోరీ జరిగినట్లు గుర్తించడంతో ఒకటో పట్టణ పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేశారు. దీంతో సంఘటనా స్థలాన్ని డీఎస్పీ గీతాకుమారి పరిశీలించి వివరాలు సేకరించారు. ఈ మేరకు ఒకటో పట్టణ సిఐ ఎస్‌కె హుస్సేన్ భాష, శేఖర్ బాబులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# టిటిడి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

## -తిరుమలలో రాష్ట్రమంత్రి ఆనం

తిరుమల.జూలై 12ప్రభాతవార్తప్రతినిధి:



టిటిడిలో ఉద్యోగుల సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని, దేవాదాయశాఖ టిటిడి సంయుక్తంగా అనేక అంశాలపై పనిచేస్తుందని రాష్ట్రమంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. రాష్ట్రంలోని అన్ని ఆలయాల్లో భక్తులకు దర్శనాలు సులభతరం చేయడం, ప్రసాదాలు నాణ్యతగా ఉండేలా చూడటం, ఆలయాల పరిశుభ్రత,ఆలయాల పునరుద్ధరణ విషయంలో ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తున్నామన్నారు.శనివారం అన్నమయ్యభవనంలో టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, టిటిడి ఈఓ జె.శ్యామలరావు, అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, దేవాదాయశాఖ కార్యదర్శి వాడ్రేవు వినయ్‌చంద్, దేవాదాయశాఖ కమిషనర్ రామచంద్రమోహన్, టిటిడి జెఈఓ వీరబ్రహ్మం, ఉపకార్యదర్శి సుధాకర్ రావు,సిపిఆర్‌ఓ డాక్టర్ తలారి రవితో కలసి సుదీర్ఘంగా ఫెండింగ్‌లో ఉన్న సంయుక్త అంశాలపై చర్చించారు. టిటిడి ఆలయాల అభివృద్ధి, భక్తులకు అందుతున్న సదుపాయాలు,భద్రత పరిపాలన అంశాలపై దేవాదాయశాఖ, టిటిడి సమన్వయంతో పనిచేస్తున్నాయన్నారు. టిటిడి విద్యాసంస్థల్లో 192 పోస్టులను ఒప్పంద అధ్యాపకులతో భర్తీచేసేందుకు చర్చించామన్నారు. ఈ సమావేశంలో టిటిడి సిఇ సత్యనారాయణ, దేవాదాయశాఖ సిఇ జివిఆర్ శేఖర్, టిటిడి,దేవాదాయశాఖ అధికారులు పాల్గొన్నారు.

# వైభవంగా కోదండరాముని రథోత్సవం

## -పోటెత్తిన భక్తజనం

తవణంపల్లె, జూలై 12 ప్రభాతవార్త;



మండలంలోని టి.పుత్తూరు గ్రామంలో వెలసిన శ్రీకోదండ రాములవారి దేవస్థానంలో జరుగుతున్న స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం స్వామివారికి రథోత్సవం వైభవంగా జరిగింది. చిత్తూరుకు చెందిన చింతగుంపల కృష్ణమూర్తి నాయుడు ఉభయదారులుగా వ్యవహరించారు. ఈ ఉదయం స్వామి, అమ్మవార్లకు పట్టు వస్త్రాలను, ఉభయాన్ని తీసుకురాగా అర్చకులు స్వామివారి మూల మూర్తులకు ప్రత్యేక అభిషేకాలను నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను శోభాయమానంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అలంకృతుడైన సీతా లక్ష్మణ సమేత కోదండ రాముడు రథంపై అధిరోహించి మంగళవాయిద్యాలు, కేరళ వాయిద్యాలు, వివిధ రకాల విచిత్ర వేషధారణలు, ప్రత్యేక బాణాసంచా పేలుళ్ళ నడుమ పురవీధులగుండా ఊరేగారు.

### తిరుపతి - చిక్కమంగళూరు మధ్య

# నూతన రైలు ప్రారంభం

కుప్పం, జూలై 12 ప్రభాతవార్త



కర్ణాటకలోని చిక్కమంగళూరు – తిరుపతి నగరం మధ్య నూతనంగా ప్రవేశ పెట్టిన వీక్లీ ట్రైన్ ప్రారంభమైంది. శుక్రవారం రాత్రి కుప్పంలో కూటమి నేతలు ఈరైలుకు ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా పైలట్, లోకోపైలట్‌ను ఘనంగా సత్కరించారు. ఈ ట్రైన్ ప్రతి గురువారం రాత్రి 9గంటలకు తిరుపతిలో బయలుదేరి కుప్పానికి శుక్రవారం వేకువజామున 1గంటకు చేరుతుంది. ఉదయం 3.05గంటలకు బెంగళూరు, 10.30గంటలకు చిక్కమంగళూరుకు చేరుతుంది. అలాగే శుక్రవారం సాయంత్రం 5.30గంటలకు చిక్కమంగళూరులో బయలుదేరి శనివారం అర్థరాత్రి 12.30గంటలకు కుప్పం, తిరుపతికి ఉదయం 7.40గంటలకు చేరుతుంది. ఈ రైలు కుప్పంలో ఆగేందుకు కృషి చేసిన సిఎం చంద్రబాబునాయుడు, రైల్వేశాఖ మంత్రులు అశ్విని వైష్ణవ్, సోమన్న, ఎంపి దగ్గుమళ్ల ప్రసాద్‌రావు, ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నంలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నేతలు డా॥ వెంకటేష్, సత్యేంద్రశేఖర్, ప్రతాప్, జాకీర్, తులసినాథ్, నరేష్, శ్యాంసుందర్, మంజు, చంద్ర, చాంద్, నాగరాజు, మంజునాథ, మురళి గుప్తా, సాయిమాతా ట్రస్ట్ వ్యవస్థాపకులు డిఎన్ జగదీష్‌బాబు పాల్గొన్నారు.



# అన్యమతంపై మాటలయుద్ధం!



### కుట్రదాగి ఉందన్న భూమన
### ఇంటింటి సర్వేతో నిగ్గుతేల్చుతామంటున్న భాను

తిరుమల,జూలై 12ప్రభాతవార్తప్రతినిధి:

ధార్మికసంస్థ టిటిడిలో అన్యమత ఉద్యోగుల కొనసాగింపు అంశంపై అటు వైసిపి ఇటు బిజెపి నేతల మధ్య మాటలయుద్ధం పెరిగింది. తాజాగా శుక్రవారం రోజు కేంద్రమంత్రి బండిసంజయ్ చేసిన వెయ్యి మందికి పైగా అన్యమత ఉద్యోగులున్నారనే సంచలన వ్యాఖ్యలపై శనివారం వైసిపి జిల్లా అధ్యక్షుడు,టిటిడి మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి ఆయన వ్యాఖ్యల వెనుక కుట్రదాగి ఉందని వ్యక్తం చేశారు. సాయంత్రానికి బిజెపి రాష్ట్రనేత, టిటిడి బోర్డుసభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి దీనిపై ఉద్యోగుల ఇంటింటి సర్వేకు సిద్ధమా అనే సవాల్ విసరడంతో తిరుపతిలో పరస్పరం మాటలతో మరింత వేడి పుట్టిస్తోంది. గత వైసిపి ప్రభుత్వంలో ఎక్కువ శాతం ఉద్యోగులు క్రైస్తవ మతంలోకి మతమార్పిడి చేసుకున్నట్లు భక్తుల నుండి అత్యధిక సంఖ్యలో ఫిర్యాదులు అందాయని, రాబోవు టిటిడి పాలకమండలి సమావేశంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉద్యోగస్తుల ఇంటింటి సర్వేకి ప్రతిపాదనలు సిద్ధంచేస్తున్నట్లు కీలక ప్రకటన చేశారు. బండి సంజయ్‌వ్యాఖ్యలను భూమన విమర్శించడం తగదని అన్నారు. ఇదిలా ఉండగా భూమన బండి వ్యాఖ్యలను తప్పుపట్టారు. ఆయన వెయ్యిమందికిపైగా అన్యమత ఉద్యోగులు అనడాన్ని ఆక్షేపిస్తున్నామన్నారు.

బండి వ్యాఖ్యలు వెనుక కుట్రదాగివుందని అనుమానం వెలిబుచ్చారు. శ్రీవారి ఆలయ ప్రతిష్ఠ మంటగలపడంతోబాటు భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా సంజయ్ భావజాలం ఉందని పేర్కొన్నారు. కేంద్రమంత్రి ఆరోపణలపై ప్రభుత్వం వివరణ ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## ఉచిత కంటి ఆపరేషన్లకు 27మంది ఎంపిక

కుప్పంరూరల్, జూలై 12 ప్రభాతవార్త




లయన్స్‌క్లబ్, పిఇఎస్ ఆస్పత్రి ఆధ్వర్యంలో శనివారం కుప్పంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. సుమారు వందమంది శిబిరంకు హాజరు కాగా వైద్యులు వారికి కంటి పరీక్షలు నిర్వహించి ఉచిత ఆపరేషన్లకు 27మందిని ఎంపిక చేశారు. శిబిరంకు వచ్చిన వారికి శ్వేతదీప గ్యాస్ ఏజెన్సీస్ అధినేత వివి అజిత్ ఆనంద్ భోజన వసతి కల్పించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ సలహాదారు మహేష్, కార్యదర్శి సెంథిల్, కోశాధికారి చరణ్, అడ్మినిస్ట్రేటర్ ప్రసాద్, సభ్యులు పిజి సెల్వం, కృష్ణమూర్తి, ఆజాద్, గంగాధర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## అర్హులందరికీ సంక్షేమ పథకాలు - మాజీ ఎమ్మెల్సీ గౌనివారి

శాంతిపురం, జూలై 12 ప్రభాతవార్త



అర్హులైన ప్రతి ఒక్కరికీ సిఎం చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాల్లో లబ్ధి కలిగిస్తుందని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం అబకలదొడ్డి, చిన్నారిదొడ్డి, నడింపల్లి, తుమ్మిశి పంచాయతీల్లో ఆయన సుపరిపాలనలో తొలి అడుగుకార్యక్రమంలోపాల్గొన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేయడం జరుగుతోందన్నారు. ప్రతినెలా ఒకటోతేది పెన్షన్లు, మహిళలకుఏటా మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, తల్లికివందనం పథకాలు అమలు చేయడం జరుగుతోందన్నారు. నిరుద్యోగ సమస్య పరిష్కారంకు 16వేల ఉపాధ్యాయుల పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టారన్నారు. ఈ సందర్భంగా ఆయా పథకాల్లో లబ్ధి పొందుతున్న వారు తమకు అందిన పథకాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. నేతలు జనార్ద నరెడ్డి, ఆంజనేయరెడ్డి, శేఖర్, రామచంద్రనాయుడు, గోవిందరాజులు, బాలకృష్ణ, పెద్దన్న, వెంకటేష్ పాల్గొన్నారు.

## చంద్రబాబు మాటలు నమ్మి మోసపోకండి

: మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి

వెదురుకుప్పం, జూలై 12 ప్రభాతవార్త :



రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాటలు నమ్మి మోసపోకండి అని మాజీ డిప్యూటీ సీఎం వైకాపా అడ్వైజర్ కమిటీ సభ్యులు నారాయణస్వామి ప్రజలకు పిలుపు నిచ్చారు. మండల కేంద్రం సమీపంలో గల పిఆర్సీ కళ్యాణ మండపంలో బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మోసపూరిత హామీలతో అధికారం దక్కించుకున్నారని, ఏడాది గడిచిన పథకాల అమలు జాడలేదని ఆరోపించారు. రాష్ట్రం ఆర్థిక పరిస్థితి బాగాలేకపోయిన ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని జగనన్న వంద శాతం అమలు చేశారని గుర్తుచేశారు. చంద్రబాబు వెన్నుపోటు రాజకీయాలతో ఎదిగారని ఆయన ప్రజలకు ఇచ్చిన హామిలను అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నారని విమర్శలు చేశారు. ప్రజలు ఇప్పటికే గుర్తించారని జగనన్నకు ప్రజలు బ్రహ్మరథం పట్టుతున్నారని జీర్ణించుకోలేక వైకాపా నాయకులు. కార్యకర్తల పై తప్పుడు కేసులు నమోదు చేస్తున్నారని ఆవేన వ్యక్తం చేశారు. అనంతరం కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గంగాధర నెల్లూరు నియోజకవర్గం ఇన్‌చార్జి కృపాలక్ష్మీ, మండల పార్టీ అధ్యక్షులు కామసాని పద్మనాభ రెడ్డి, జడ్పీటీసీ చలం పాళ్యం సుకుమార్, ఎంపీటీసీ రాధికపురంధర్ రెడ్డి, పెరుమాళ్ళపల్లె ఎంపిటిసి తోకల మురళి రెడ్డి, మాజీ ఎంపిపి జ్ఞానకొండా రెడ్డి, నాయకులు బట్టే సుబ్రమణ్యం, రామయ్య, చిరంజీవి రెడ్డి, హేమసుందర్ రెడ్డి, నరసింహా రెడ్డి పెద్ద సంఖ్యలో కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కార్యకర్త కుటుంబానికి ఎన్వీఆర్ అండ

పుంగనూరు, జూలై 12, ప్రభాతవార్త



మండలంలోని సింగర్‌గుంట గ్రామానికి చెందిన జనసేన కుటుంబ సభ్యుడు నారాయణ భార్య అనారోగ్యంతో చికిత్స పొందుతోంది. ఈ విషయం తెలుసుకున్న జనసేన పార్టీ పుంగనూరు నియోజకవర్గ నాయకుడు, ఎన్వీఆర్ ట్రస్ట్ అధినేత ఎన్. వేణుగోపాల్ రెడ్డి, అనారోగ్యంతో బాధపడుతున్న మహిళకు ఆర్థిక సహాయం అందించారు. ట్రస్టు సభ్యులు శివకుమార్ రెడ్డి తదితరులు ఈ నగదును వారి కుటుంబసభ్యులు కర్ర చేశారు. సహాయపడిన వేణుగోపాల్ రెడ్డికి గ్రామస్థులు కృతజ్ఞతలు తెలియజేశారు.

## నూతన వసతి సముదాయాలు ఏర్పాటుచేయండి

-టిటిడి చైర్మన్‌కు ఎమ్మెల్యే పులిపర్తి నానివినతి



***తిరుమల, జూలై 12 ప్రభాతవార్త:*** చంద్రగిరి నియోజకవర్గంలో పరిధిలోని టిటిడి ఆలయాలు, కళ్యాణమండపలను అభివృద్ధి చేయాలని చంద్రగిరి ఎమ్మెల్యే పులిపర్తి నాని కోరారు. శనివారం ఆయన తిరుమలలోని టిటిడి చైర్మన్ క్యాంప్ కార్యాలయంలో ఛైర్మన్ బి ఆర్ నాయుడుని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ముఖ్యంగా శ్రీవారి మెట్టు మార్గాన వచ్చే భక్తులకు సేదతీరడం కోసం చంద్రగిరి మండలంలో నూతన వసతి సముదాయాలు ఏర్పాటుచేయాలని, నియోజకవర్గంలో ప్రజలకు నెలలో ఒకరోజు శ్రీవారి ఉచిత దర్శనాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

## శ్రీవారి ఆశీస్సులు అందుకున్నాం



***తిరుమల, జూలై 12ప్రభాతవార్తప్రతినిధి:*** శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులు అందుకున్నామని, అందరూ సంతోషంగా ఉండాలని వేడుకున్నట్లు యాదవ సంక్షేమ కార్పొరేషన్ ఛైర్మన్ జి. నరసింహయాదవ్ తెలిపారు. శనివారం ఉదయం ఆయన కుటుంబంతో విఐపి బ్రేక్ దర్శనంలో శ్రీవారిని దర్శించు కున్నారు. ఆలయ అధికారులు వీరికి దర్శనం చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు.

## రూ.600కోట్లు ఫీజు రీఎంబర్స్‌మెంట్‌పై

తెలుగుయువత హర్షం



***తిరుపతి, జూలై 12ప్రభాతవార్త:***
రాష్ట్రవ్యాప్తంగా 2024-25 సంవత్సరానికి పెండింగ్‌లో ఉన్న ఫీజు రీ ఎంబర్స్‌మెంట్ బకాయిల్లో 600కోట్ల రూపాయలు ప్రభుత్వం విడుదల చేయడంపై తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగాల ఆనందగౌడ్ హర్షం వ్యక్తం చేశారు. క్రింది స్థాయి నుండి పై స్థాయి వరకు ఉన్నత విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు ఎటువంటి సమస్యలు రాకుండా వారికి అండగా నిలబడటం కోసమే రాష్ట్రవిద్యాశాఖమంత్రి నారాలోకేశ్ ఫీజు రీఎంబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయడం జరిగిందన్నారు. యువతకు ఆదర్శనాయకుడుగా నిలుస్తున్నారన్నారు. ఉన్నతవిద్యను గత ప్రభుత్వంలో ఓ అధికారి సర్వనాశనం చేశారని ఆనంద్‌గౌడ్ విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా ఫీజు రీ ఎంబర్స్‌మెంట్ విడుదల కావడంతో ప్రైవేటు కళాశాలల యాజమాన్యం ఊపిరిపీల్చుకున్నాయన్నారు. విద్యార్థులకు ఆపన్నహస్తంగా మంత్రి లోకేశ్ నిలిచారన్నారు.

## దెబ్బతిన్న ట్రాన్స్‌ఫార్మర్: సేవలు పునరుద్ధరణ



***పుంగనూరు రూరల్, జూలై 12, ప్రభాతవార్త*** పట్టణంలోని ముడెప్ప సర్కిల్ వద్ద శనివారం ఉదయం జరిగిన అనుకోని ఘటన కలకలం రేపింది. స్థానికంగా ఉన్న పెద్ద చెట్టు నుంచి ఒక్కసారిగా ఓ భారీ కొమ్మ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పై విరిగిపడింది. దీనితో భారీ శబ్దం వచ్చి ట్రాన్స్‌ఫార్మర్ దెబ్బతినటంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. రద్దీగా ఉండే ప్రాంతంలో జరిగిన ఈ ఘటనతో ప్రజలు కాసేపు భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న విద్యుత్ శాఖ అధికారులు సిబ్బందితో కలిసి వెంటనే మరమ్మతులు చేపట్టి విద్యుత్‌ను పునరుద్ధరించారు.

## కుట్రలు చేయడం వైకాపా నీచ సంస్కృతి

– రాష్ట్ర తెలుగుదేశం అధికార ప్రతినిధి వెంకిటీల సురేంద్రకుమార్



**చిత్తూరు, జులై 12 ప్రభాతవార్త:** కుట్రలు చేయడం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నీచ సంస్కృతి అని రాష్ట్ర తెలుగుదేశం అదికార ప్రతినిధిఇ వెంకిటీల సురేంద్రకుమార్ పేర్కొన్నారు. జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైకాపా నాయకులు ప్రజలు నమ్మి ఓట్లు వేస్తే సేవ చేయాలనే తలంపు లేకుండా తిరిగి అధికారంలోకి వస్తే పగ ఎలా తీర్చుకోవాలని ఆలోచిస్తున్నారని మండిపడ్డారు. సత్తెనపల్లిలో మాజీ సిఎం వైఎస్ జగన్ పర్యటనలో రప్పా రప్పా అని ప్లకార్డు పెడితే వైఎస్ జగన్ స్పందించకపోవడంతో నేడు మాజీ మంత్రి పేర్నినాని చీకట్లో నరికేయాలని అని మాట్లాడటం దేనికి సంకేతమో చెప్పాలన్నారు. వైకాపా నాయకులు హింసను ప్రేరేపించే మాటలు తగ్గించి రాష్ట్ర అభివృద్ధికి సహకారం అందిస్తే ప్రజలకు మీపై వున్న కోపం కొంత తగ్గుతుందన్నారు.

## పాలసముద్రం మండలంలో ఇసుకే బంగారం




– ట్రాక్టరు లోడ్ రూ.10 వేలుకు విక్రయాలు

– అధికారులు సీజ్ చేసిన డంపులు మాయం

**పాలసముద్రం, జూలై 12 ప్రభాతవార్త:** పాలసముద్రం మండలంలో ఇసుక అక్రమ రవాణా చేసి కొంతమంది నాయకులు జేబులు నింపుకుంటున్నారు. పాలసముద్రం మండలంలోని పలు గ్రామాల్లో ఇసుక డంప్‌లు ఏర్పాటు చేసి అక్కడి నిల్వ చేసిన ఇసుకను ఎక్కువ ధరలకు తమిళనాడు రాష్ట్రానికి తరలిస్తుండటంతో వారికి కాసుల వర్షం కురుస్తోంది. పాలసముద్రం మండలంలో ఒక ట్రాక్టరు ఇసుక రూ.3 నుండి రూ.4 వేలకు లభ్యం అయితే ఇదే ఇసుకను కొంతమంది అక్రమార్కులు గుట్టుచప్పుడు కాకుండా తమిళనాడు రాష్ట్రంకు తరలించి ఒక లోడ్డును రూ.10 వేల వరకు విక్రయిస్తున్నట్లు సమాచారం. మండల పరిధిలో ఇసుక కొరత సృష్టించడంతో సిమెంటు రోడ్లు, ఇళ్ళ నిర్మాణాలకు ఇసుక లభ్యం కాని పరిస్థితి ఏర్పడి నిర్మాణాలు ఆగిపోయే పరిస్థితి నెలకొంది. గతంలో కొన్ని గ్రామాల్లో ఇసుక నిల్వలను గుర్తించిన అధికారులు ఆ డంప్‌లను సీజ్ చేశారు. ఈ డంప్‌లు ప్రస్తుతం గ్రామాల నుండి మాయం అవుతున్నప్పటికీ అధికారులు పట్టించుకోని పరిస్థితి ఏర్పడింది. ఇసుక డంప్‌లు వున్న వారికి అధికారులు, అధికార పార్టీ నాయకుల అండ పుష్కలంగా వుండటంతో వారు ఇష్టారాజ్యంగా ఇసుకను విక్రయించి లక్షల రూపాయలు ఆర్జిస్తున్నారు. వనదుర్గాపురం కాలువ వాగు నుండి ఇసుకను తరలించి పంట పొలాల్లో నిల్వ చేశారు. ఈ విషయం తెలిసి అధికారులు వనదుర్గాపురంలోని ఇసుక డంప్‌తో పాటు మరికొన్ని గ్రామాల్లోని ఇసుక డంప్‌ను సీజ్ చేశారు. ఇసుక డంప్ చేసి నిల్వ చేస్తున్న వారిపై పోలీసులు, అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

## డాక్టరేట్ అందుకొన్న మోహన్‌రాజ్

చిత్తూరురూరల్, జులై 12 ప్రభాతవార్త:



బెంగళూరుకు చెందిన భారత్ వర్చువల్ యూనివర్శిటీ పీస్ అండ్ ఎడ్యుకేషన్‌వారు తెలుగుదేశం పార్టీ కార్యాలయ కార్యదర్శి పి మోహన్‌రాజ్‌కు గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసారు. శనివారం బెంగళూరు లోని ఓ ప్రైవేట్ ఇంటర్నేషన్ హోటల్ నందు శని వారం సామాజిక, రాజకీయరంగంలో అత్యుత్తమైన సేవలందించినందుకు ఈ అవార్డును మోహన్‌రాజ్ అందుకోవడం జరిగింది. కాగా డాక్టరేట్ అందుకొన్న మోహన్‌రాజ్‌ను కృష్ణమూర్తి, శశికర్‌బాబు, మేషక్, గిరి, రామూర్తి, జయచంద్ర, ఫలాని, కందంస్వామి, సురేష్, స్టాలిన్ , హరీష్, దినకర్, ప్రశాంత్‌లు దుశ్శాలువతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు.

## నేడు మాజీ మంత్రి పెద్దిరెడ్డి పర్యటన

చౌడేపల్లి, జూలై 12 ప్రభాతవార్త



మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిఈనెల 13న చౌడేపల్లిలో పర్యటించ నున్నట్లు వైకాపా మండలాధ్యక్షుడు గౌడప్పగారి నాగభూషణంరెడ్డి తెలిపారు. ఈమేరకు స్థానిక బైసాని కళ్యాణమండపంలో ఏర్పాట్లను పర్య వేక్షిం చారు. బాబుష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్ర మంలో పాల్గొంటారనీ మండలంలోని వైకాపా ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. వైకాపా నాయకులు రుక్మిణమ్మ, మిద్దింటి కిషోర్‌బాబు, కళ్యాణ్‌భరత్, సుధాకర్‌రెడ్డి, పవన్‌రాయల్, మంజునాథ్, రాము తదితరులు పాల్గొన్నారు.

## రాజనాలబండపై శనివారం పూజలు

-సత్యప్రమాణాల జోరు

చౌడేపల్లి, జూలై 12 ప్రభాతవార్త



సత్యప్రమాణాలకు పేరుగాంచిన రాజనాబండపై శనివారం విశేష పూజలు నిర్వహించారు. టిటిడి ఆధ్వర్యంలో ప్రధానార్చకుడు కృష్ణమూర్తి నరసింహస్వామి క్షేత్ర పాలకుడు ప్రసన్న ఆంజనేయస్వామికి ఉదయాన్నే వివిధ రకాల జలాలు, పుష్పాలతో అభిషేకించి, విశేష అలంకరణగావించాడు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన కొందరు ప్రమాణాలు చేయగా, మరికొందరు వాయిదా వేసుకొని వెళ్ళారు. స్వామివారి మహిమలను తెలుసుకొని భక్తులు ఆయన ఎదుట మోకరిల్లారు. పవిత్ర తీర్థ ప్రసాదాలందించారు.

## విశేష పూజలందుకొన్న వేణుగోపాలస్వామి



***చౌడేపల్లి, జూలై 12 ప్రభాతవార్త*** స్థానిక రుక్మిణీ, సత్యభామా సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో శనివారం విశేష పూజలను సాంప్రదాయబద్ధంగా నిర్వహిం చారు. ఆలయ ప్రధానార్చకుడు వశిష్టాచార్యుల ఆధ్వర్యంలో వేణుగోపాలస్వామికి విశేషాభిషేకం, అలంకరణగావించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని పట్టణంతోపాటు ఇతర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో పూజలో పాల్గొని స్వామివారి పవిత్ర తీర్థ ప్రసాదాలను గైకొన్నారు.

## రాష్ట్రాన్ని గాడిన పెడుతున్న సిఎం చంద్రబాబు



– ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం

**కుప్పం, జూలై 12 ప్రభాతవార్త** వైకాపా పాలనలో అన్ని విధాలా చితికిపోయిన రాష్ట్రాన్ని సిఎం చంద్రబాబునాయుడు మరలా గాడిన పెడుతున్నారని ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం పేర్కొన్నారు. శనివారం మున్సిపల్ పరిధి 20వ వార్డులో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొని ఇంటింటా తిరిగి ప్రజలకు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు వివరించి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓ పక్క వైకాపా ప్రభుత్వం చేసిన పది లక్షల కోట్ల అప్పులకు అసలు, వడ్డీలు చెల్లిస్తూ మరో పక్క ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్న ఘనత సిఎం చంద్రబాబుకే దక్కుతుందన్నారు. నిరుద్యోగ యువతకు 16743పోస్టులతో మెగా డిఎస్సీ, చదువుకునే పిల్లలకు తల్లికివందనం, రైతులకు అన్నదాత సుఖీభవ పథకాలతో పాటు అన్నక్యాంటీన్ల పునఃప్రారంభంచేశారన్నారు. గ్రామాలు, పట్టణాల్లో అభివృద్ధి పనులకు మరలా శ్రీకారం చుట్టారన్నారు. వచ్చే నెలలో మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం పథకం సైతం అమలు చేయడం జరుగుతుందన్నారు. అర్హులకు పెన్షన్లు, దీపం కనెక్షన్లు మంజూరు చేశామన్నారు. ప్రజలు కూడా తమకు మేలు చేస్తున్న నాయకుడిని గుర్తుంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జ్ సోమశేఖర్, కో ఇన్‌చార్జ్ శ్యామసుందర్, నేతలు సత్యేంద్రశేఖర్, పివి ఉపేంద్రకుమార్, హర్షధర్మతేజ, నాను, అప్పి, మహబూబ్ తదితరులు పాల్గొన్నారు.

## ఇక ప్రజా సమస్యలపై పోరాటం

– కాంగ్రెస్ కమిటీ సమీక్షా సమావేశంలో డిసిసి అధ్యక్షులు పోటుగారి.భాస్కర్



***చిత్తూరు, జులై 12 ప్రభాతవార్త:*** రాష్ట్రంలో ఎన్నికలు పూర్తయి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయినా కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయలేదేని, ఇక కాంగ్రెస్ పార్టీ ప్రజా సమస్యలపై పోరాటం చేసి ప్రజలకు న్యాయం చేయడానికి సిద్దమవుతుందని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోటుగారి భాస్కర్ అన్నారు. చిత్తూరులో శనివారం చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ సమీక్షా సమావేశం నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జీ టిక్కిరాయల్ అధ్యక్షతన జరిగింది. సమావేశానికి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జీ రాంభూపాల్‌రెడ్డి, డిసిసి అధ్యక్షులు పోటుగారి భాస్కర్ హాజరయ్యారు. డిసిసి అధ్యక్షులు మాట్లాడుతూ గత ప్రభుత్వం కొత్త జిల్లాలు ఏర్పాటు చేయడంతో అప్పటి వరకు చిత్తూరు జిల్లాలో కలసి వున్న తిరుపతి నూతన జిల్లాగా ఆవిర్భావించిందన్నారు. జిల్లా నుండి తిరుపతి విడిపోవడంతో చిత్తూరు జిల్లాలో ప్రభుత్వ విద్యా సంస్థలు, పరిశ్రమలు అటకెక్కాయన్నారు. చిత్తూరు నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జీ టిక్కి రాయల్ మాట్లాడుతూ చిత్తూరు జిల్లా కేంద్రంలో సత్వరం ప్రభుత్వం ప్రభుత్వ మెడికల్ కళాశాల, ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలతో పాటు యువత ఉపాధి కల్పనకు పరిశ్రమలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఇక కాంగ్రెస్ పార్టీ చిత్తూరు నియోజకవర్గ పరిధిలో అనునిత్యం ప్రభుత్వ మెడికల్, ఇంజనీరింగ్ కళాశాలల ఏర్పాటుపై పోరాటం సాగిస్తుందన్నారు. అలాగే ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి ఒక్క హామీని ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం చిత్తూరు నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జీ టిక్కి రాయల్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు చిత్తూరులో ప్రభుత్వ మెడికల్, ఇంజనీరింగ్ కళాశాలలు ఏర్పాటు చేయాలని నినాదాలు చేశారు. ఈ సమావేశంలో డిసిసి ఉపాధ్యక్షులు లోకేష్, చిత్తూరు జిల్లా కాంగ్రెస్ బిసి సెల్ అధ్యక్షులు దొరస్వామి, నగర కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు అంబిక, మాజీ పిసిసి కార్యదర్శి పరదేశి, నగర ఉపాధ్యక్షులు మధు, ఉదయ్‌కుమార్‌లు, చిత్తూరు బిసి సెల్ అధ్యక్షుడు నరేష్ తదితరులు పాల్గొన్నారు

## ఉన్నతమైన ఆలోచనలతో అద్భుతమైన జీవితం

చిత్తూరురూరల్, జులై 12 ప్రభాతవార్త:



నిరంతర ధ్యాన సాధనతో ఆత్మశక్తి పెరుగడం, తద్వారా ఆలోచనా విధానం మారుడం, ఉన్నతమైన ఆలోచనలతో అద్భుతమైన జీవితంను సృష్టించుకోవచ్చునని సీనియర్ పిరమిడ్ మాస్టర్లు మహమ్మద్ అమల్ అలీఖాన్, శ్రీమతి హనీఅమన్ అలీఖాన్‌లు పేర్కొన్నారు. కాణిపాకం సమీపంలోని శ్రీ విఘ్నేశ్వర పిరమిడ్ మహాశక్తి క్షేత్రం నందు మూడు రోజుల పాటు నిర్వహించే ఆత్మజ్ఞాన సదస్సులో మాట్లాడుతూ ప్రతి జీవిలో భగవంతుని దర్శించాలని, మానవ సేవే మాధవ సేవఅని, ప్రతి ఒక్కరికి ప్రేమను పంచాలనీ, ప్రేమతో సాధించలేనిది ఏదీ లేదని పేర్కొంటూ ప్రతి రోజు ధ్యానం, స్వాధ్యయం, సజ్జన సాంగత్యం కొనసాగించాలన్నారు. గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొనగా, వారందరికీ ఉచిత భోజన సదుపాయంను గ్లోబల్ స్పిరిచువల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు డా.బి.గోపాలక్రిష్ణమూర్తి, ట్రస్ట్ కన్వీనర్ శ్రీమతి రాధికలు ఏర్పాటు చేసారు. అనంతరం వక్తలను దుశ్శాలువతో ఘనంగా సత్కరించి, వారి చేత పాల్గొన్న వారందరికీ త్రిముఖ రుద్రాక్షను అందజేసారు.

## గురుకుల పాఠశాల ప్రవేశాలకు 20న ప్రవేశ పరీక్ష

సదుం, జూలై 12 ప్రభాతవార్త

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న సదంలోని మహాత్మా జ్యోతిబాపూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాల ప్రవేశాలకు ఈనెల 20న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. 5 ,8 ,7, 9 తరగతిలో ఖాళీగా ఉన్న సీట్లకు 18వ తేదీలోగా ఆసక్తిగల విద్యార్థులు దరఖాస్తుల సమర్పించాలన్నారు. పూర్తి వివరాలకు 9000054508 నెంబర్ కు ఫోన్ చేసి తెలుసుకోవాల్సిన అన్నారు. సదంలోని గురుకుల పాఠశాలలో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారని ఆయన చెప్పారు. పాఠశాలకు వచ్చే విద్యార్థులు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలను, ఆధార్ కార్డు తీసుకురావాలని చెప్పారు.

## నేడు సదుంలో ఉచిత కంటి వైద్య శిబిరం

సదుం, జూలై 12 ప్రభాతవార్త

ఈనెల 12వ తేదీ ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు సదుంలోని శ్రీ సుబ్రహ్మణ్య స్వామి ఆలయం వద్ద తిరుపతి అరవింద కంటి వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తారని నిర్వాహకులు పేర్కొన్నారు. కంటి ఆపరేషన్లకు ఎంపికైన వారికి ఉచితంగా తీసుకుని వెళ్లి తిరుపతిలో చికిత్సలు చేయించుకుని తిరిగి సుబ్రమణ్య స్వామి ఆలయం వద్ద వదిలిపెడతామని వారు పేర్కొన్నారు.

## గణనాథుని దర్శించుకున్న ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు ఛైర్మన్

కాణిపాకం, జూలై 12 ప్రభాతవార్త:



ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు ఛైర్మన్ ప్రమోద్‌కుమార్‌రెడ్డి శనివారం కుటుంబసమేతంగా కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొన్నారు. వారికి వేదమంపడపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. అనంతరం వారు శ్రీవీరాంజనేయస్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలలో కూడా పూజలు నిర్వహించారు. వారి వెంట ఆలయ సూపరెండెంట్ వాసు, సీఎఫ్ఓ నాగేశ్వరరావు, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ చిట్టిబాబు పాల్గొన్నారు.

## విజయపురంలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం

విజయపురం, జూలై 12 ప్రభాతవార్త:




రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ఆదేశాల మేరకు మండలంలోని విజయపురం గ్రామ పంచాయతీ పరిధిలో పార్టీ రాష్ట్ర బీసీసెల్ అధికార ప్రతినిధి ధనంజ యాదవ్‌తో పలువురు నాయకులు కలసి ఇంటింటికి వెళ్లి గత ఏడాదిలో ఓటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, అమలుచేసిన పథకాలను ప్రజలకు వివరించి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కపిల్, సామివేలు, దండయ్య, గిరి, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

## పాస్ మనోవికాస కేంద్రంలో ఘనంగా ధనరాయల్ జన్మదినవేడుకలు

తిరుపతిరూరల్, జూలై 12 ప్రభాతవార్త:




తిరుపతిరూరల్ మండలం గాంధీపురం గ్రామ పంచాయతీ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ధనరాయల్ జన్మదిన వేడుకలను పాస్ మనో వికాస్ కేంద్రంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా శనివారం పద్మావతి పురంలోని పాస్ మనో వికాస కేంద్రంలో బుద్ధి మాంద్య పిల్లలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. బుద్ధి మాంద్య పిల్లల మధ్య కేక్‌కట్ చేసి, జన్మదినాన్ని జరుపుకోవడం సంతోషంగా ఉందని ధన రాయల్ తెలిపారు. ధన రాయల్ టిడిపి నాయకులు కార్యకర్తలు ఘనంగా సన్మానించి, దుస్సాలవతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో చల్లా శ్రీనివాస్, రమేష్, మునికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ సబ్ స్టేషన్‌లు పెంచండి

మంత్రి గొట్టిపాటికి ఎమ్మెల్యే వినతి



తిరుపతి విద్య జూలై 12 ప్రభాత వార్త

పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా తిరుపతిలో నూతనంగా పది విద్యుత్ సబ్ స్టేషన్లు ఏర్పాటు చేయాలని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ ను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు శనివారం ఉదయం కోరారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా పర్యటనలో భాగంగా తిరుపతికి వచ్చిన విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటికి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు వినతి పత్రం ఇచ్చారు. జనభా పెరుగుదలతో విద్యుత్ వినయోగం పెరిగిందని భవిష్యత్ అవసరాల దృష్ట్యా విద్యుత్ సరఫరా మెరుగుదలకు 33 / 11 కేవి సబ్ స్టేషన్లను ఏర్పాటు చేయాలని ఆ వినతి పత్రంలో ఎమ్మెల్యే కోరారు. మహిళా యూనివర్సిటీ, ఆర్సీ రోడ్డు, కొరమేణుగుంట, తుడా టవర్స్ వద్ద తక్షిణం సబ్ స్టేషన్లు ఏర్పాటుకు మంత్రి అంగీకరించారు. అలాగే బైరాగిపట్టెడ, జీవకోన, రామచంద్రపుష్కరిణి, శెట్టిపల్లి, కపిలతీర్థం, అర్బన్ తహశీల్దార్ కార్యాలయ సమీపంలో కూడా సబ్ స్టేషన్లు ఏర్పాటు చేయాలని కోరగా త్వరలోనే వీటి నిర్మాణానికి ఏపిఈఆర్సీ అనుమతి ఇస్తుందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుకు మంత్రి స్పష్టం చేశారు.

## పీవీ హైస్కూలులో తల్లికి వందనం కార్యక్రమం

విజయపురం, జూలై 12 ప్రభాతవార్త:

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తల్లికి వందనం కార్యక్రమంపై శనివారం మండలంలోని పీవీ హైస్కూలులో లబ్దిదారుల తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నెహ్రూ యువజన సేవా సంఘం డైరెక్టర్ ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ తల్లికి వందనం కార్యక్రమం పేద విద్యార్థులకు వరం లాంటిదని, ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకుని విద్యార్థుల విద్యాభివృద్ధి సాధించేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని తెలిపారు. కార్యక్రమంలో సామిరెడ్డి కండ్రిగ సర్పంచ్ సుబ్రహ్మణ్యం, ఎన్‌వైఎస్‌ఎస్ బోర్డు సభ్యుడు మునికృష్ణయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాలకృష్ణ, సచివాలయ సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## వైసీపీ జిల్లా కమిటీలో విజయపురం నాయకులకు స్థానం

విజయపురం, జూలై 12 ప్రభాతవార్త:

వైసీపీ జిల్లా కమిటీలో మండలంలోని పలువురు నాయకులకు స్థానం కల్పించారు. ఇందులో పంచాయతీరాజ్ వింగ్ కార్యదర్శిగా చెంచు వరప్రసాద్, బూత్ కమిటీ వింగ్ ప్రధాన కార్యదర్శిగా రామకృష్ణమరాజు, ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడిగా ఆనంద్, గ్రీవెన్స్ సెల్ కార్యదర్శిగా సి.కుమార్‌రెడ్డి, ఆర్‌టీఐ వింగ్ కార్యదర్శిగా రాజేష్, పంచాయతీ రాజ్ వింగ్ ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా పరంధామయాదవ్, ఎం.శ్రీనివాస్‌రెడ్డి, బీసీసెల్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడిగా ఎన్.చంద్రయ్య, వాణిజ్య విభాగ ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా గోపినాథ్‌రాజు, సుబ్రహ్మణ్యంరెడ్డి, కల్చరల్ వింగ్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడిగా ఎం.సుబ్రహ్మణ్యం, సోషల్ మీడియా ఎగ్జిక్యూటివ్ సభ్యుడిగా జీకే జిల్లుదాస్‌లు నియమితులయ్యారు.

## విమానాశ్రయ ప్రైవేటీకరణ ఆపాలి

.రేణిగుంట జూలై 12 ప్రభాతవార్త




రేణిగుంట (తిరుపతి) అంతర్జాతీయ విమానాశ్రయ ప్రైవేటీకరణను వెంటనే ఆపాలని మాజీ కేంద్రమంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చింతామోహన్ అన్నారు. రేణిగుంట గాంధీ బొమ్మ సెంటర్లో విమానాశ్రయ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ శనివారం మాజీ కేంద్ర మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చింతామోహన్ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన జరిగింది. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ సుమారు 50 వేల కోట్ల రూపాయల విలువ కలిగిన విమానాశ్రయాన్ని కేంద్ర ప్రభుత్వం అదానికి అప్పగించడానికి ప్రయత్నాలు చేస్తున్నదన్నారు. ప్రైవేటీకరణను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నదని తెలిపారు. ప్రైవేటీకరణ చేస్తే ఎట్టి పరిస్థితుల్లో సహించమన్నారు. కార్యక్రమంలో రేణిగుంట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వీఆర్ రావణన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, పాల్గొన్నారు.

## చుక్కల నిడిగల్లులో సిపిఐ శాఖా సమావేశం

శ్రీకాళహస్తిరూరల్, జూలై 12 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి మండలం చుక్కల నిడిగల్లు, అమ్మపాళెం గ్రామాల్లో ఆదివారం సిపిఐ శాఖా సమావేశాలను నియోజకవర్గ ఇన్‌చార్జి జనమాల గురవయ్య సారధ్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ వందెళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా జాతీయ పార్టీ పిలుపు మేరకు ప్రతి గ్రామంలో వంద చెట్లు నాటాలని వంద జెండాలను ఎగుర వేయాలనే లక్ష్యంతో సమావేశాలు నిర్వహిస్తున్నట్లు గురవయ్య వివరించారు. పార్టీ స్థాపించి 2025 డిసెంబర్ నాటికి వందెళ్ల పూర్తి అవుతుందని ఈ పయనంలో భూమి కోసం, భూసంస్కరణలు, రాజభరణాల రద్దు, బ్యాంకుల జాతీయకరణ, కార్మిక చట్టాలు అమలు మొదలగు కీలక అంశాలపై ఉద్యమించి విజయం సాదించారన్నారు. ఈ కార్యక్రమాల్లో గురవయ్యతో పాటు పట్టణ కార్యదర్శి రొడ్డ గోపి, బుజ్జమ్మ, పోలయ్య, చెంచయ్య, భరత్, వెంకటమ్మ, రాజేశ్వరి, శానమ్మ, మునెమ్మల సారధ్యంలో కార్యక్రమాలు నిర్వహించారు.

## గురుకులంలో నీటి సమస్య పరిష్కారం

తొలి అడుగులో సమస్యల పరిష్కారం

శ్రీకాళహస్తి, జూలై 12 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి మున్సిపల్ పరిధిలో ప్రభుత్వం చేపట్టిన ఏడాది సుపరిపాలనలో భాగంగా తొలి అడుగు కార్యక్రమాల్లో ప్రభుత్వం చేపట్టిన పథకాలను వివరించటమేకాకుండా ఎంతో కాలంగా పరిష్కారానికి నోచుకోని సమస్యలను వెంటనే పరిష్కరింపజేయటంలో ఎంఎల్ఏ సుధీర్‌రెడ్డి ముందు వరుసలో ఉన్నారు. ఏదైనా సమస్య ఆర్థిక పరంగాకానిది ఉంటే వెంటనే అధికారులచే పరిష్కరింపజేస్తున్నారు. ఈ నేపధ్యంలో 32వ వార్డులో తొలి అడుగు డి.2డికార్యక్రమాల్లో శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి 32 వ వార్డులో పర్యటిస్తున్నపుడు ఇక్కడ గల గురుకులంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు మంచినీటి సమస్యతో సతమతమౌతున్నామని వివరించారు. స్పందించిన ఎంఎల్ఏ మున్సిపల్ కమిషనర్ సంజీవ్‌కుమార్‌కు వెంటనే సమస్యను పరిష్కరించమని ఆదేశించారు. దాంతో ఈ వార్డులోని యూనిట్ ఇన్‌చార్జి పోలూరు శ్రీనివాసులు రెడ్డికి అమలు బాధ్యతను అప్పగించారు. ఆయన మున్సిపల్ అదికారులతో సమన్వయం చేసుకుంటూ శనివారం గురుకులంలో మున్సిపల్ మంచినీటి కొళాయిని వేయించారు. కార్యక్రమాల్లో శ్రీనివాసులు రెడ్డితో పాటు మైనారిటి నాయకులు షేక్ షాహా బుద్దిన్, మునికుమార్ మున్సిపల్ ఇంజనీర్లు సిబ్బంది పాల్గొన్నారు.

## రాజీవ్‌నగర్ సమస్యకు పరిష్కారం: సదుపాయాలకు ప్రణాళిక

శ్రీకాళహస్తి, జూలై 12 ప్రభాతవార్త



రాజీవ్‌నగర్ సమస్యలను పరిష్కరిస్తామని మౌళిక సదుపాయాలకు పెద్ద పీట వేస్తున్నట్లు పట్టణ అధ్యక్షుడు జి.విజయకుమార్‌నాయుడు అన్నారు. శనివారం తెలుగుదేశం పార్టీ నాయకులు స్థానిక శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి ఆదేశాలతో రాజీవ్‌నగర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా అక్కడి ప్రజలు ఎంతో కాలంగా మంచినీటి సమస్యను ఎదుర్కొంటున్నామని సుమారు20 సంవత్సరాలు గడుస్తున్నా నేటికీ మౌళిక సదుపాయాలు లేవని రోడ్లు, మురికి నీటి కాలువల్లేదని నాయకులకు వివరించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పథకాలను వివరించారు. అంతేకాక రాబోవు రోజుల్లో రాజీవ్‌నగర్‌లో సకల సదుపాయాలకు ఎంఎల్ఏ మున్సిపల్ అధికారులకు వివరించారన్నారు. ముఖ్యంగా ఇదో శాటిలైట్‌సిటిగా తీర్చిదిద్దుటకు చర్యలు తీసుకుంటున్నారని విజయకుమార్ వివరించారు ఇక్కడ ఆక్రమణల తొలగింపుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఈ కార్యక్రమాల్లో విజయకుమార్‌తో పాటు క్లస్టర్ ఇన్‌చార్జిగాదిపాకుల గోపినాథ్, సురేష్, తులసమ్మ, అమరావతి, దాక్షాయణి, పద్మ, వాసునాయుడు, అరుణ్, కృష్ణ, శివయ్య, చెంచయ్య తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎస్ ఎస్ కెనాల్‌కు మోక్షం:

శ్రీకాళహస్తిరూరల్, జూలై 12 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి మండలంలోని రైతులకు ఎంతోకాలంగా అపరిష్కృతంగా ఉన్న ఎస్ ఎస్ కెనాల్ సమస్యకు పరిష్కారం సాదించి రైతులకు సంక్షేమానికి శాసనసభ్యుడు బొజ్జల సుధీర్‌రెడ్డి కృషి చేస్తున్నారని మాజీ వ్యవసాయమార్కెట్ కమిటి చైర్మెన్ రంగినేని చెంచయ్యనాయుడు అన్నారు. శనివారం మండలంలోని ఎంపేడు, అంజనేయపురం గ్రామ పంచాయతీ పరిధిలో పర్యటించి వివరించారు. శ్రీకాళహస్తి మండలంలో నిరుద్యోగులకు ఉపాధి కల్పనకు ఆపాచి సంస్థను తీసుకురావటానికి పరుగులు తీస్తున్నారని అంతేకాక మన్నవరం వద్ద భెల్ సంస్థ ఉపయోగించని స్థలాన్ని స్వాదీనం చేసుకొని కొత్త పరిశ్రమలతో నిరుద్యోగులకు ఉపాధి కల్పించబడుతుందని చెంచయ్యనాయుడు వివరించారు. ఇక కూటమి ప్రభుత్వం సారధ్యంలో చేపట్టిన పథకాలకు సంబంధించి వివరించారు. సూపర్ సిక్స్ కార్యక్రమాల్లో ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు సదుపాయం కల్పించబడుతుందని చెంచయ్యనాయుడు వివరించారు. ఈ కార్యక్రమాల్లో నియోజకవర్గ పరిశీలకులు అంకయ్యచౌదరి, మండల పార్టీ అధ్యక్షుడు అంక్షితల కృష్ణయాదవ్, చెలికం పాపిరెడ్డి, సుబ్బారెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, గురవారెడ్డి, రవీంద్రనాథ్‌రెడ్డి, జగదీశ్వరరెడ్డి, ఆర్ సుభాషిని, బ్రాహ్మణపల్లి కృష్ణం నాయుడు, చరణ్, రఘునాయుడు, హరిరాయల్, మనోహర్, హరికృష్ణ, రమేష్‌నాయుడు, సుదర్శన్‌రెడ్డి, శివప్రసాద్, వెంకటరామయ్య, గురుమూర్తి, ఉమేంద్ర, నవీన్, గురుమూర్తినాయుడు, అనిల్, నవీన్‌గోపి, గున్నయ్యపవన్‌రాయల్, సుబ్బురాయల్, తదితరులు పాల్గొన్నారు.

## ఊరందూరులో దేశం నాయకుల సందడి

శ్రీకాళహస్తిరూరల్, జూలై 12 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి మండలం ఊరందూరు గ్రామం శనివారం రాజకీయ సందడిగా మారింది. రాష్ట్ర నాయకులు ఊరందూరు గ్రామానికి రావటంతో స్వాగతాలు పలకరింపులతో కళ కళ లాడింది. రాష్ట్ర మాజీ మంత్రి ఎనమల రామకృష్ణుడు, తుని ఎంఎల్ఏ ప్రభుత్వ చీఫ్ విప్ యనమల దివ్య, మరో ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్రలు వచ్చారు. వారికి సాదరస్వాగతం పలికారు. వారితో ఉన్న అనుబందాన్ని బొజ్జల కుటుంబసభ్యులు బొజ్జల బృందమ్మ, రిషితారెడ్డిలు పంచుకున్నారు. బొజ్జల గోపాలకృష్ణారెడ్డి హయాంలో రాష్ట్రంలోని తెలుగుదేశం సీనియర్‌నాయకులతో మేమేకమ య్యేవారు. దాంతో ఆ అనుబంధాలు అలాగే ఉన్నాయి. నేటికి మంత్రులుపార్టీ ప్రముఖులు శ్రీకాళహస్తికి ఆలయానికి వచ్చినపుడు బొజ్జల స్వగ్రామం ఊరందూరుకు వచ్చి ఆతిథ్యం స్వీకరించే సంప్రదాయాన్ని అమలు చేస్తున్నారు. ఈ సందర్భంగా మంత్రులకు శ్రీ వెంకటేశ్వరస్వామి చిత్రపటాలను ఇచ్చి సత్కరించారు. కుటుంబసభ్యులతో కలసి ఫోటోలు దిగారు. ఈ సందర్భంగా పట్టణ పార్టీ అధ్యక్షుడు జి.విజయకుమార్‌నాయుడు, మాజీ మార్కెటింగ్ కమిటి చైర్మెన్ రంగినేని చెంచయ్యానాయుడు, కృష్ణయాదవ్, రావిళ్ళ మునిరాజానాయుడు, నాగమల్లి దుర్గాప్రసాద్‌లు మంత్రులతో సత్కరించారు.

## ముక్కంటి సేవలో ఎస్వి గ్రూప్

శ్రీకాళహస్తి, జూలై 12 ప్రభాతవార్త




శ్రీకాళహస్తీశ్వరుని సేవలో శనివారం బెంగుళూరుకు చెందిన ఎస్వి గ్రూప్ ఇన్సిస్టిట్యూట్ వైస్ చైర్మెన్ స్వాతి కుటుంబసభ్యులతో పాల్గొన్నారు. ఇక్కడకు వచ్చిన ఆమె తాను రాహుకేతుదోష నివారణ పూజలు జరిపించుకోవాలని ఎఇఓ మోహన్‌ను అభ్యర్ధించారు. వవెంటనే ఆయన ప్రత్యేక టిక్కెట్టు కొనుగోలు చేసి సహ్రస్రలింగేశ్వరుని ఆలయం వద్ద వేదపం డితులను ఏర్పాటు చేసారు. పూజల అనంతరం వారికి స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం ఏర్పాటు చేసారు. తరువాత వారికి వేదపండితులచే ప్రత్యేకాశీర్వచనాలు, తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ విద్యాసంస్థ విద్యార్థులకు ఉచితంగాచదువుకోటానికి అవకాశం కల్పించటం అభినందనీయం. వారికి కే.రాము, కత్తి సాయి, తదితరులు స్వాగతం పలికారు.

## పిఆర్‌మోహన్‌కు ఘన నివాళి

శ్రీకాళహస్తి, జూలై 12 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి ధర్మకర్తల మండలి మాజీ చైర్మెన్ శాప్ మాజీ చైర్మెన్ దివంగత నాయకుడు పిఆర్‌మోహన్ 5వ వర్ధంతిని అభిమానులు శనివారం ఘనంగా నిర్వహించారు. నితీ నిజాయితికి నిలువెల్ల దర్పణం క్రీడాకారుడు, విద్యాధికుడు అయిన పిఆర్‌మోహన్ మృతి తీరని లోటు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మిత్రబృందం సమాధి వద్ద కార్యక్రమాలను నిర్వహించారు. ఆయన ఆత్మకు శాంతి కల్గించాలని ప్రార్థనలు జరిపారు. ఆయన సేవలు మరువరానివని శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి అన్నారు.. పోలసామి షణ్ముగం, అద్దంకి డాంగే ,జయరాం, పోలసామి స్వర్ణమూర్తి తదితరులు పాల్గొని నివాళులర్పించారు.



## మీ ఇంటికి.... మీ బొజ్జల..



రేణిగుంట జూలై 12 ప్రభాతవార్త రేణిగుంట మండలం తూకివాకం పంచాయతీ ఎస్ఎన్ పురం, గంగుంట ప్రాంతాల్లో శనివారం ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి సుపరిపాలనకు తొలి అడుగు నందు భాగంగా తూకివాకం మాజీ సర్పంచ్ భాస్కర్ యాదవ్ ఆధ్వర్యంలో కూలి సుబ్బయ్య, యేసయ్య, కుసుమ కుమారి, పూమణి, జై కృష్ణ తదితరులతో ఇంటింటికి తిరిగి ప్రజల కష్ట సుఖాలు తెలుసుకున్నారు. పింఛన్లు వస్తున్నాయా, నెల నెల రేషన్ సరుకులు సరఫరా అవుతున్నాయా, సబ్సిడీపై సిలిండర్లు ఇస్తున్నారా, తదితర సంక్షేమ పథకాలను ఆరా తీశారు. ప్రజల సమస్యలను తెలుసుకొని వెంటనే పరిష్కరించాల్సిందిగా అధికారులను ఆదేశించారు. ఆగస్టు 15వ తేదీ నుండి మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం అందుబాటులోకి వస్తుందన్నారు. ప్రజలకు ఏ సమస్య వచ్చిన తన దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో రేణిగుంట పట్టణ టిడిపి అధ్యక్షుడు మహబూబాషా, టిడిపి సీనియర్ నాయకులు చిన్నారెడ్డి, నెల్లూరు సుబ్రహ్మణ్యం, అన్నాసంపల్లి నాదముని రెడ్డి, కొరియర్ రవి, అగ్రహారం భాస్కర్ రెడ్డి, సూరిబాబు, ఉదయ భాస్కర్ రెడ్డి, ఏపీ ఎస్పీడీసీఎల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రమేష్ బాబు, తూకివాకం కార్యదర్శి రమేష్, గాజులమండ్యం మాజీ సర్పంచ్ శ్రీ రాజ్, ఎస్సై సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

.రేణిగుంట జూలై 12 ప్రభాతవార్త



రేణిగుంట మండలం గాజులమండ్యం పోలీస్ స్టేషన్ పరిధిలోని మర్రిగుంట క్రాస్ వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సి భాస్కర్ (34) అక్కడికక్కడే మృతిచెందాడు. ఎస్సై సుధాకర్ కథనం మేరకు శ్రీకాళహస్తి సమీపంలోని లాంకో కంపెనీలో విధులు నిర్వహిస్తున్న భాస్కర్ ద్విచక్ర వాహనంపై తిరుపతి వెళుతుండగా మర్రిగుంట క్రాస్ వద్ద కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే చర్యలు తప్పవు

.రేణిగుంట జూలై 12 ప్రభాతవార్త

రేణిగుంట మండలంలో ఎక్కడైనా ఎవరైనా ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే చర్యలు కఠినంగా ఉంటాయని రేణిగుంట తహసిల్దార్ చంద్రశేఖర్ రెడ్డి హెచ్చరించారు. రేణిగుంట మండలం గాజులమండ్యం గ్రామం రెవెన్యూ లెక్క దాఖల సర్వే నంబర్ 11 29 నందు హై స్కూల్ పక్కన 5.14 ఎకరాల ప్రభుత్వ భూమిని రియల్ ఎస్టేట్ వ్యక్తులు ఆక్రమించి ఫెన్సింగ్ వేసినట్లు తమ దృష్టికి వచ్చిందని తహసీల్దార్ తెలిపారు. శుక్రవారం రెవిన్యూ సిబ్బందితో అక్కడకు చేరుకొని ఫెన్సింగ్ తొలగించి ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకున్నామన్నారు. ప్రభుత్వ భూమిని ఆక్రమించిన వారిని గుర్తించి వారిపై కేసులు పెడతామన్నారు. ఎవరు ఎట్టి పరిస్థితుల్లో ప్రభుత్వ భూములను ఆక్రమించకూడదని ఆయన తెలిపారు.

## వైసీపీ నుంచి టీడీపీలోచేరిక

వడమాలపేట, జూలై 12 ప్రభాతవార్త:

వడమాలపేట మండలంలోని బట్టికండ్రిగకు చెందిన పలువురు టీడీపీలో చేరారు. వైసీపీనుంచి అల్లం రాజేష్, చంద్రశేఖర్, రామయ్య, పర్రి శివయ్యలు చేరారు. తిరుపతిలోని ఎమ్మెల్యే నివాసం వద్ద వీరికి పార్టీ కండువాలు వేసి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ఆహ్వానించారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం కార్యక్రమాల పట్ల ఆకర్షితులై పార్టీలో చేరినట్టు తెలిపారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు దాముయాదవ్, సర్పంచ్ వెంకటేష్, ప్రభాకర్, రమేష్ యాదవ్, శివరాజు, పొన్నయిరాజు, సుబ్రహ్మణ్యంరాజు, చంద్ర, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## 77వ ఆడికృత్తిక మహోత్సవానికి ముహూర్తం ఖరారు

పాకాల, జులై 12, ప్రభాతవార్త



పాకాల మండలం ఉప్పరపల్లె పంచాయతీ ఊట్ల వారి పల్లిలో ఆనందగిరి కొండపై వెలసి ఉన్న శ్రీ వల్లి దేవసేన సమేత షణ్ముఖ సుబ్రహ్మణ్య స్వామి 77వ ఆడికృత్తిక మహోత్సవానికి చంద్రగిరి శాసనసభ్యులు పులివర్తి నాని అధ్యక్షతన వేద బ్రాహ్మణులు ముహూర్తం ఆగస్టు నెలలో ఖరారు చేసారు. ఆగస్టు నెల 13వ తారీకు నుంచి 17వ తారీఖు వరకు జరగనున్న ఆడికృత్తిక ఉత్సవాలలో అన్ని శాఖల అధికారులు ఇప్పటి నుంచే సమన్వయంతో పనిచేసి స్వామివారి దర్శనార్థం వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. పాకాల మండలానికి తలమానికంగా దినదిన ప్రవర్తమానంగా ప్రసిద్ధి చెందుచున్న పుణ్యక్షేత్రం నందు జరుగు కార్యక్రమాలలో మంచినీటి వసతి, ఉచిత అన్నదాన కార్యక్రమాలు, భక్తులకు మౌలిక సదుపాయాల కల్పన వంటి కార్యక్రమాలపై శనివారం రోజున అన్ని శాఖల అధికారులతో ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించి ఎంఎల్ ఏ దిశా నిర్దేశం చేశారు.

## మాజీ సర్పంచ్ భార్య మృతికి టిడిపి నివాళి

పుత్తూరు, జూలై 12 ప్రభాతవార్త :



మండలంలోని తిరుమలకుప్పం పంచాయతీ మాజీ సర్పంచ్ గాలి రామచంద్రనాయుడు సతీమణి జి.ఆర్.సుబ్బరత్నమ్మ మృతి పట్ల రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరక్టర్ గంజి మాధవయ్య సంతాపం వ్యక్తం చేశారు. శనివారం టిడిపి అధికార ప్రతినిధి చినబాబుతో కలిసి ఆమె పార్థివ దేహాన్ని సందర్శించి పూలమాలల వేసి నివాళులర్పించారు. తెలుగుదేశం పార్టీకి వారి కుటుంబం చేసిన సేవలు స్మరించుకున్నారు. ఆమె కుమారుడు, టిడిపి సీనియర్ నాయకుడు గాలి సతీష్‌నాయుడుకు, ఇతర కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సంతాపం తెలిపారు. కార్యక్రమంలో వీరితో పాటు పార్టీ రూరల్ మండల అధ్యక్షుడు ఎ.బాలాజీ, వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యదర్శి ఇనుగుర్తి రవినాయుడు, నాయకులు ఈశ్వర్ ప్రసాద్, గిరి, మగేష్ తదితరులు పాల్గొన్నారు.

## మృతులకు మాజీ ఎమ్మెల్సీ గాలి సరస్వతమ్మ నివాళులు

పుత్తూరు, జూలై 12 ప్రభాతవార్త :



నగరి రూరల్ మండలం మేళపట్టుకు చెందిన వైఎస్సాఆర్ కాంగ్రెస్ పార్టీ మాజీ మండల కన్వీనర్ సుదర్శనం నాయుడు మృతికి దివంగత నాయకుడు గాలి ముద్దుకృష్ణమనాయుడు సతీమణి, మాజీ ఎమ్మెల్సీ గాలి సరస్వతమ్మ శనివారం నివాళులర్పించారు. ఆయన పార్థివ దేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలిపారు. అలాగే పుత్తూరు రూరల్ మండల పరిధిలోని తిరుమలకుప్పం పంచాయతీ మాజీ సర్పంచ్ గాలి రామచంద్రనాయుడు సతీమణి జి.ఆర్.సుబ్బరత్నమ్మ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆమె కుమారుడు గాలి సతీష్‌నాయుడు, ఇతర కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలిపారు.

## వైస్ ఎంపీపీ సరోజిని మృతి

సత్యవేడు, జూలై 12 ప్రభాతవార్త:



సత్యవేడు మండలం మదనంబేడు గ్రామానికి చెందిన వైస్ ఎంపీపీ(వైసీపీ) సరోజిని మృతికి స్థానిక ఎంపీపీ ప్రతిమ, జడ్పీటీసీ విజయలక్ష్మి, మాజీ జడ్పీటీసీ వీరేంద్రవర్మ, నిరంజన్‌రెడ్డి, బెల్ట్ రమేష్ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. అనారోగ్య కారణాల వల్ల వైస్‌ఎంపీపీ సరోజిని శనివారం ఉదయం మృతి చెందింది. వైస్ ఎంపీపీగా అభివృద్ధికి బాట వేసినట్టు ఈ సందర్భంగా ఎంపీపీ, జడ్పీటీసీ విజయలక్ష్మి పేర్కొన్నారు. వైస్ ఎంపీపీ సరోజిని మృతి వైసీపీ పార్టీకి తీరని లోటని ఆమె తెలిపారు. ఈ నేపథ్యంలో రాబర్ట్ కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

## శ్రీకాళహస్తిలో సత్యసాయి ప్రేమ ప్రవాహిని యాత్ర



శ్రీకాళహస్తి, జూలై 12 ప్రభాతవార్త శ్రీకాళహస్తిలోని ముత్యాలమ్మగుడి వీధిలో వెలసిన సత్యసాయి బాబా ఆలయంలో శనివారం సత్యసాయి ప్రేమా ప్రవాహిని కార్యక్రమాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయంరథాన్ని ఏర్పాటు చేసి అందులోబాబా చిత్రపటాన్ని ఆవిష్కరించి పూజలు నిర్వహిస్తూ గ్రామంలో ఉత్సవాన్నినిర్వహించారు. చిన్నారుల దేవుళ్ళ వేషాలతో నాలుగు మాడా వీధుల్లో సంచరించారు. భక్తులు భజనలు చేస్తూ అన్న సంతర్పణ గావిస్తూ ముందుకు సాగారు. ఊరేగింపులో బాబాను స్తుతిస్తూ కీర్తనలు పాడారు. మహిళా భక్తులు భజనలు చేసారు. ఊరేగింపు ముత్యాలమ్మగుడివీ, నగరి వీధి, బజారువీధి, తేరువీధి, నెహ్రూవీధుల మీదుగా సాగింది.

## ఈసీ మీటింగ్ తర్వాతే సెలెక్టెడ్ లిస్ట్.

తిరుపతి విద్య, జూలై 12 ప్రభాత వార్త

ఎస్వీయూలో అకడమిక్ కన్సల్టెంట్లకు ఫెర్ఫార్మెన్స్ రివ్యూ పేరుతో గత వారం జరిగిన ఇంటర్వ్యూలకు సంబంధించి సెలెక్టెడ్ లిస్టు విడుదల కాస్తా ఆలస్యం కానుంది. వచ్చే వారంలో ఈసీ సమావేశం నిర్వహించి ఆమోదముద్ర పడిన తర్వాత విడుదల చేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. దీంతో తాత్కాలిక అధ్యాపకులు అర్హుల జాబితా ఎప్పుడు విడుదలయ్యేనా... అందులో తమ పేరు ఉంటుందో లేదో అనే టెన్షన్తో ఉన్నామని అధ్యాపకులు మధ్య వర్సిటీలో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. ఇంజనీరింగ్ విభాగంలోనూ. సైన్స్ విభాగాలలో పనిచేసే అధ్యాపకులకు డోకా ఉండదని, కేవలం సెల్ఫ్ సపోర్టింగ్ కోర్సులు, ఆర్ట్స్ గ్రూప్లలో పనిచేస్తున్న అకడమిక్ కన్సల్టెంట్ల పరిస్థితి ఆగమ్య గోచరంగా తయారైందనే వార్తలు వర్సిటీలో చక్కర్లు కొడుతున్నాయి.

# తిరుపతి డివిజన్

## 22న నాయి బ్రాహ్మణ సేవా సంఘం నూతన కార్యవర్గ ఎన్నికలు

- ఆవుల పాటి బుజ్జిబాబు



తిరుపతి హెల్త్, జూలై 12 ప్రభాతవార్త : ఈ నెల 22వ తేదిన తిరుపతి నగర నాయి బ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గ ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర నాయి బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆవులపాటి బుజ్జిబాబు తెలిపారు. బ్యాలెట్ పద్ధతి ద్వారా ఎన్నికలు నిర్వహిస్తున్నామని, 22వ తేది మంగళవారం ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు యూత్ హాస్టల్‌లో ఎన్నికలు జరుగుతాయని చెప్పారు. నగర అధ్యక్షులు, కార్యదర్శి, కోశాధికారి మూడు పోస్టులకు ఎన్నికలు నిర్వహిస్తున్నామని, నగర పరిధిలోని బార్బర్ షాపుల యజమానులతో పాటు వర్కర్లు వారి ఓటు హక్కును వినియోగించుకోవచ్చునన్నారు. తిరుపతి నగర నాయిబ్రాహ్మణ సంఘం మాజీ అధ్యక్షులు సిబ్యాల సుధాకర్‌మాట్లాడుతూనాయిబ్రాహ్మణసోదరులువారి ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ప్రేమపట్టుదల బాధ్యతలు నడుమ జయం

-రేపటి నుండి పేక్షకులకు వినోదం

తిరుపతి రవాణ, జూలై 12ప్రభాతవార్త పేమ, మోసం, పట్టుదల, బాధ్యతల నడుమసాగే మరో సరికొత్త ,స్ఫూర్తివంతమైన కథతో ప్రేక్షకుల ముందుకురానున్న సీరియల్ 'జయం'. తెలుగు ప్రేక్షకులకు ఎల్లప్పుడు వినోదం అందించే జీ ఛానల్ తెలుగు మరో సరికొత్త ,స్ఫూర్తివంతమైన కథతో ప్రేక్షకుల ముందుకు ఈ నెల 14 వతేదీ సోమవారం నుండి శనివారం వరకు ప్రతిరోజు రాత్రి 8 గంటలకు ప్రసాం మవుతుంది. ఇతర ధారావాహికల ప్రసార సమయాల్లో స్వల్ప మార్పులు రానున్నాయి. చామంతి రాత్రి 8.30 గంటలకు, జగద్ధాత్రి రాత్రి 9 గంటలకు ప్రసారమవుతాయని ప్రతినిధి ప్రసాద్‌గుప్త తెలిపారు.

## ఘనంగా నారాయణ విజయోత్సవ్- 2025




తిరుపతి విద్య జూలై 12 ప్రభాత వార్త: నారాయణ విద్యా సంస్థలు జే ఈ ఈ, నీట్ పరీక్షలలో ఓపెన్ కేటగిరీలో జాతీయ స్థాయి 51వ ర్యాంకు తో పాటు మొదటి వెయ్యిలో 6 అత్యుత్తమ ర్యాంకులను సాధించిన సందర్భంగా స్థానిక మహతి ఆడిటోరియంలో నిర్వహించించిన విజయోత్సవ సభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన తిరుపతి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు మాట్లాడుతూ విద్యార్థులు తిరుపతిలోనే చదివి ఐఐటి, నీట్ వంటి పరీక్షలలో అత్యుత్తమ ర్యాంకులు సాధించడం చాల గొప్ప విషయమనీ, విద్యార్థులను టాప్ ర్యాంకులు సాధించే విధంగా శిక్షణ నిచ్చిన కళాశాల యజమాన్యానికి అభినందలు తెలుపుతూ, విద్యార్థులు మరెన్నో విజయాలను సాధించాలని ఆకాంక్షించారు. విద్యాసంస్థల ప్రెసిడెంట్ కె పునీత్ మాట్లాడుతూ దేశంలోని అన్ని రాష్ట్రాల జిల్లా కేంద్రాలలో తమ విద్యా సంస్థలను స్థాపించి మరెంతో మంది విద్యార్థులను జీవితంలో అత్యున్నత స్థాయికి తీసుకువెళ్లటమే తమ ఆకాంక్షని తెలిపారు. డి జి ఎం కొండలరావు మాట్లాడుతూ జిల్లాలో తమ విద్యార్థులు 100 కు పైగా ఐ ఐ టి, ఎన్ ఐ టి, 50 కి పైగా ఎం బి బి ఎస్ సీట్లు సాధించడం గర్వకారణమని తెలిపారు. సీట్లు సాధించిన విద్యార్థులను వారి తల్లిదండ్రులను, అధ్యాపకులను కోర్ డీన్ శ్రీనివాసరావు, విద్యాసంస్థల అకడమిక్ హెడ్ డాక్టర్ ప్రమీల, డీన్లు ప్రిన్సిపల్స్ జ్ఞాపికలతో సత్కరించారు.

## విద్యార్థి దశ నుండే క్రమశిక్షణతో కూడిన విలువలను అలవర్చుకోవాలి.

- ఆర్‌టిఓ మురళిమోహన్



తిరుపతి విద్య జూలై 12 ప్రభాత వార్త: స్థానిక యశోద నగర్ లోని లిటిల్ ఏంజెల్స్ పాఠశాలలో నూతన స్కూల్ క్యాబినెట్ ను ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమానికి తిరుపతి ఆర్ టి ఓ కె.మురళి మోహన్, అలిపిరి సి ఐ పి ఎస్ వి రామ కిశోర్ ముఖ్య అతిథులుగా విచ్చేసారు. అనంతరం కే. మురళి మోహన్ విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే క్రమశిక్షణతో కూడిన విలువలను అలవర్చుకొని లక్ష్య సాధనకు శ్రీకారం చుట్టాలన్నారు. రామ్ కిషోర్ మాట్లాడుతూ విద్యార్థులు నాయకత్వ లక్షణాలను విద్యార్థి దశ నుండే అలవర్చుకోవాలని పాఠశాల విద్యార్థులకు ఈ అవకాశాన్ని కల్పించారని, డా.ఎ పి జె అబ్దుల్ కలాం చెప్పినట్లు నిద్రపోతూ కలలు కనండి నిద్రలేచి ఆ కలలను సాకారం చేసుకోవడానికి ప్రయత్నం చేయండి. రాయిలా కూర్చోకుండా గడియారంలా పనిచేయాలని విద్యార్థులను కోరారు. పాఠశాల అధినేత కె. రాజుగోపాల్ రెడ్డి, డైరెక్టర్ డాక్టర్ కే ఆర్ శ్వేతా రెడ్డి నూతన స్కూల్ క్యాబినెట్ కు అభినందనలు తెలిపారు. ఇది విద్యార్థులు ఉజ్వల భవిష్యత్తుకే కాకుండా దేశానికి, సమాజానికి క్రమశిక్షణ, విశ్వసనీయత, నిబద్ధత కలిగిన పౌరులుగా తీర్చి దిద్దుకోవడానికి ఎంతో తోడ్పడుతుందని చైర్ పర్సన్ కే.రమాదేవి తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వై.పద్మశ్రీ ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## బీసీ హాస్టల్‌లో మెరుగైన వసతులు కల్పించండి

- డాక్టర్ నారాయణ గౌడ్



తిరుపతి విద్య, జూలై 12 ప్రభాత వార్త తిరుపతి జిల్లా వ్యాప్తంగా ఉన్న బీసీ బాలుర, బాలికల హాస్టల్స్‌లో అధ్వానంగా ఉన్నాయని కొన్ని హాస్టల్లో మెనూ ప్రకారం భోజన సదుపాయాలు కల్పించకపోవడం బీసీ విద్యార్థులకు శాపాలుగా మారాయని ఆంధ్రప్రదేశ్ బీసీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పర్చూరు నారాయణ గౌడ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గౌడ్ మాట్లాడుతూ ఇటీవల శ్రీ కాళహస్తిలోని బిసి బాలుర, బాలికల హాస్టల్ లో ఫుడ్ పాయిజన్ జరిగి విద్యార్థులు అస్వస్థతకు గురికావడం బాధాకరం శనివారం చంద్రగిరి లోని బీసీ బాలికల హాస్టల్లో సరైన వసతి సదుపాయాలు లేక మెనూ ప్రకారం భోజనం కల్పించకపోవడం వలన విద్యార్థులు ధర్నాకు దిగడం బాధాకరం. కలెక్టర్ తక్షణమే బీసీ హాస్టల్ ను సందర్శించి మెరుగైన వసతి సదుపాయాలు మెనూ ప్రకారం నాణ్యతతో కూడిన భోజన సదుపాయాలు కల్పించే విధంగా చర్యలు చేపట్టాలని బాధ్యత రాహిత్యంగా వ్యవహరిస్తున్న వార్డన్లను విధుల నుంచి తొలగించాలని కోరారు.

## నేడు మహాలక్ష్మి కల్యాణ మండపంలో...

శ్రీ పద్మావతి శ్రీనివాస కల్యాణ మహోత్సవం



తిరుపతి కలెక్టరేట్, జూలై 12 ప్రభాతవార్త : సనాతర ధర్మ వారధి కేసీ దాస్ ట్రస్ట్ విభాగ సమన్వయ కర్తలు కె. రాధాకృష్ణ, పి. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆదివారం తిరుచానూరులోని శ్రీ మహాలక్ష్మి కల్యాణ మండపంలో శ్రీ పద్మావతి శ్రీనివాస కల్యాణ మహోత్సవం జరగనుంది. కేసీ దాస్ స్మారక సేవా సంస్థకు ఆధ్యాత్మిక అనుబంధ సంస్థ గురు దంపతి పూజ్య బ్రహ్మశ్రీ కల్వకోలను శ్రీరామచంద్రమూర్తి, అమ్మ జయలక్ష్మి శుభ ఆశీస్సులతో, వారి సమక్షంలో లోక కల్యాణం అనే సంకల్పంతో సామాన్య భక్తునికి అందుబాటులో నిర్వహించనున్నారు. భగవంతునికి భక్తునికి వారధులుగా ఎన్నో సంవత్సరాలుగా కోటి హనుమాన్ చాలీసా, గణపతి మూలమంత్రం, సీతారామ కల్యాణం, సామూహిక వరలక్ష్మి వ్రతం, కార్తీక మాసంలో శివార్చన వంటి ఎన్నో కార్యక్రమాలను ఆన్‌లైన్‌లో, సమూహికంగా నిర్వహిస్తున్నామని, ప్రతి భక్తుడు, భక్తురాలు సద్వినియోగం చేసుకోవాలని బహ్మశ్రీ కల్వకొలను రామచంద్రమూర్తి, జయలక్ష్మి దంపుతులు విజ్ఞప్తి చేశారు.

## ప్రభుత్వం చేసిన మంచిని ప్రతి ఒక్కరికి వివరిద్దాం - కూరపాటి శంకర్‌రెడ్డి

కేవీబీ పురం, జూలై 12 ప్రభాతవార్త:



ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం చేసిన మంచి పనులను ప్రతి ఒక్కరికి వివరించడమే లక్ష్యంగా ముందుకెళ్దామని టీడీపీ నాయకులకు, కార్యకర్తలకు సత్యవేడు నియోజకవర్గ టీడీపీ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ కూరపాటి శంకర్‌రెడ్డి తెలిపారు. కేవీబీ పురం మండలంలోని అంజూరు, అంజూరు పాళెం గ్రామాల్లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు రామాంజులనాయుడు, పార్లమెంట్ రైతు విభాగ అధ్యక్షుడు గోపినాథ్‌రెడ్డి, బీసీసెల్ నాయకుడు మునస్వామి యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అంజూరులో దేవాలయం వద్ద ఏర్పాటు చేసిన సభలో శంకర్‌రెడ్డి మాట్లాడుతూ మండలంలో పత్తిగెలిచిన తరువాత అభివృద్ధి పనుల్లో కావచ్చు నాయకుల్లో కావచ్చు ఐదు వర్గాలుగా ఏర్పడి అభివృద్ధికి నోచుకోలేకుండా అస్తవ్యస్తమైందని తెలుగుదేశం పార్టీ అత్యధిక మెజారిటీ సాధిస్తుందని ముఖ్యంగా ఉండాలని నాయకులు, కార్యకర్తలు విబేధాలు లేకుండా ఉండాలని, అందరం కలసికట్టుగా అభివృద్ధి పనులు ప్రజల్లోకి తీసుకెళ్దామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే హేమలత, టీడీపీ మండల అధ్యక్షుడు రామంజులనాయుడు, జిల్లా పార్లమెంట్ రైతు విభాగం అధ్యక్షుడు గోపినాథ్‌రెడ్డి, రాష్ట్ర పార్టీ ఉపాధ్యక్షుడు సతీష్‌నాయుడు, రాష్ట్ర వాణిజ్య విభాగ పద్మనాభరాజు, రాష్ట్ర బీసీసెల్ ప్రధాన కార్యదర్శి మునస్వామి యాదవ్, సర్పంచ్‌లు దొరబాబునాయుడు, వెంకటేశులు, సురేష్‌చౌదరి, లోకినాయుడు, కాలంగి రిజర్వాయర్ ప్రెసిడెంట్ రాజారెడ్డి, మకేష్‌రెడ్డి, వెంకట్ రాజు, పెద్దబ్బ, ధనశేఖర్, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలు పావని, వరలక్ష్మి, మాజీ సర్పంచ్ రాజు, టీడీపీ మండల నాయకులు, టీడీపీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## శంకర్‌రెడ్డిని సన్మానించిన మాజీ ఎంపీటీసీ వినాయకం

సత్యవేడు, జూలై 12 ప్రభాతవార్త:



సత్యవేడు నియోజకవర్గ టీడీపీ ప్రోగ్రాం సమన్వయకర్తగా నియమితులైన కూరపాటి శంకర్‌రెడ్డిని అంబాకం పంచాయతీ సెగ్మెంట్ టీడీపీ మాజీ ఎంపీటీసీ వినాయకం, మరి కొందరు నేతలు ఘనంగా సన్మానించారు. శనివారం తిరుపతిలోని ఆయన స్వగృహంలో పుదుకుప్పం టీడీపీ నేతలు వినాయకం, సర్పంచ్ దేవేంద్రన్, ఆర్ముగం, దయానిధి, వెంకటేష్, నాగరాజు, వినోద్, పృథ్వి, మణి, మోహన్ తదితరులు ఆయనకు శాలువ కప్పి పూలమాలతో సత్కరించి అభినందనలు తెలియజేశారు.

# నిరవధిక సమ్మెకు సిద్ధం



గూడూరు, జూలై 12 ప్రభాతవార్త: గూడూరులోని ఏ.పి.మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సి.ఐ.టి.యు) అనుబంధం ఆధర్యంలో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ఇచ్చిన పిలుపులో భాగంగా జూలై 12వ తేది శనివారం అర్ధరాత్రి నుండి మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు వారి సమస్యలు పరిష్కారం కొరకు సమ్మె లోనికి వెళ్లడం జరుగుతుంది. పై విషయమై నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు పలు దపాలు మంత్రులకు, ఎమ్మెల్యేలను కలిసి సమస్యలపై వినతి పత్రాలు ఇవ్వడం జరిగిందని, వారిని కలిసినా ఎటువంటి ప్రయోజనం కనపడక పోవడంతో వారి నుండి సమాధానం రాకపోవడంతో 12వ తేదీ అర్ధరాత్రి నుండి సమ్మెలోకి వెళ్లేందుకు సిద్ధమవడం జరిగిందని. ఇందులో భాగంగా గూడూరు మున్సిపల్ పరిధిలో ఇంజనీరింగ్ విభాగంలో పనిచేస్తున్న కార్మికులను సంబంధిత సి.ఐ.టి. యు నాయకులు జోగి.శివకుమార్, బి.వి.రమణయ్యలు శనివారం ఉదయం మస్టరు పాయింట్ వద్దకు వెళ్లి ఇంజనీరింగ్ విభాగంలో పనిచేస్తున్న కార్మికులతో సమ్మె విషయమై చర్చించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గూడూరు మున్సిపల్ కార్మిక సంఘం కార్యదర్శి దారా కోటేశ్వర రావు, గౌరవాధ్యక్షులు జోగి శివకుమార్, సి.ఐ.టి.యు ప్రధాన కార్యదర్శి బి.వి.రమణయ్య, అధ్యక్షులు ప్నామజి మణి, నాయకులు పుట్టా శంకరయ్య, ఎస్.డి.రఫీ, నారాయణ, ఎంబేటి చంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ఎనర్జీ అసిస్టెంట్ల సమస్యలు పరిష్కరించండి



సూళ్లూరుపేట, జులై 12 ప్రభాతవార్త: సచివాలయాల్లో పనిచేస్తున్న ఎనర్జీ అసోసి యేషన్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని తిరుపతి జిల్లా నాయుడుపేట డివిజన్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.మురళీకృష్ణకు శనివారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎనర్జీ అసిస్టెంట్స్ డివిజన్‌నాయకులు ఎం.శ్రీనివాసులు, ఎ.విజయ కుమార్‌లు మాట్లాడుతూ ఎనర్జీ అసిస్టెంట్లకు నూతన సర్వీస్ రూల్స్ రద్దు చేసి ఏపీఎస్ఇబి రూల్స్ ప్రకారం ఎఎల్ఎంగా ప్రమోషన్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. తమ సమస్యలు తక్షణమే పరిష్కరించాలని, లేనిపక్షంలో ఈ నెల 21న జరిగే ఛలో విజయవాడ కార్యక్రమంలో తమ నిరసన తెలియజేస్తూ రామవరప్పాడు రింగ్‌రోడ్డు నుంచి విద్యుత్ సౌధ వరకు మహాధర్నా నిర్వహిస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సుజిత్, చరణ్, హేమంత్, నవరాజ్‌లు పాల్గొన్నారు.

## చంద్రబాబు మాయమాటలను నమ్మొద్దు :మాజీ ఎమ్మెల్యే



సూళ్లూరుపేట, జులై 12 ప్రభాతవార్త: కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడుస్తున్నప్పటికీ చంద్రబాబు మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను ఇంతవరకు అమలు చేయలేదని, చంద్రబాబు మాయమాటలను నమ్మి ప్రజలు మోసపో వద్దంటూ మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. సూళ్లూరుపేటలోని సత్యసాయి కల్యాణ మండపంలో శనివారం బాబు షూరిటీ మోసం గ్యారెంటీ పేరుతో సూళ్లూరుపేట నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఎన్నికలకు ముందు చంద్రబాబు ఇచ్చిన హామీలను గాలికొదిలేసి ఒక్క సంవత్సరంలోనే రెండు లక్షల కోట్లు అప్పు చేసినా సంక్షేమం కనిపించడం లేదని తెలిపారు. ఒకపక్క తాము సంక్షేమం చేస్తున్నామంటూ అరకొరగా సంక్షేమ కార్యక్రమాలు చేపడుతూ ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు కామిరెడ్డి సత్యనారాయణ రెడ్డి, కామిరెడ్డి రాజారెడ్డి, అల్లూరు అనిల్‌కుమార్‌రెడ్డి, జెట్టి వేణు, కలికి మాధవరెడ్డి, ఎంఎం సెంథిల్‌కుమార్, మీజూరు రామకృష్ణారెడ్డి, నియోజకవర్గం లోని ఆరు మండలాలకు చెందిన నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అన్నదానం

సూళ్లూరుపేట, జులై 12 ప్రభాతవార్త: సూళ్లూరుపేటలోని లయన్స్ క్లబ్ ఆఫ్ సూళ్లూరుపేట, షార్ వారి ఆధ్వర్యంలో శనివారం స్థానిక బస్టాండు వద్ద అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. లయన్స్ క్లబ్ సభ్యులు పిఆర్‌సి మోహన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. లయన్స్ క్లబ్ ఆర్5 రీజియన్ సెక్రటరీ ఆదిశేషారెడ్డి, అధ్యక్షురాలు లలిత, కార్యదర్శి అరుణకుమారి, ట్రెజరర్ జానకి పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది.

## ప్రభాకర్‌రెడ్డిని పరామర్శించిన ఎమ్మెల్యే



కోట, జులై 12 ప్రభాతవార్త : మండలం విద్యానగర్‌లో పెల్లూరు ప్రభాకర్‌రెడ్డి మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ విద్యానగర్‌లో ప్రభాకర్‌రెడ్డి భౌతికకాయానికి నివాళి అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలిపారు. ఆయన వెంట కోట మండల టిడిపి అధ్యక్షుడు పలగాటి భాస్కర్‌రెడ్డి, జిల్లా టిడిపి మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ జలీల్ అహ్మద్, నెల్లూరుపల్లి కొత్తపాలెం జలసంఘం అధ్యక్షుడు నెల్లూరు మోహన్‌రెడ్డి, వెంకన్నపాలెం సర్పంచ్ కె.మధుయాదవ్ తదితరులు ఉన్నారు.

## పిఎసిఎస్ అధ్యక్షులు వీరే

కోట, జులై 12 ప్రభాతవార్త : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతులకు సేవలు అందించే ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘాల (పిఎసిఎస్) అధ్యక్షుల నియామకానికి పచ్చజెండా ఊపింది. అధ్యక్షులతో పాటు సభ్యులతో కూడిన త్రిసభ పాలక మండళ్లను నియమిస్తూ నిర్ణయం తీసుకుంది. కోట మండలంలోని ఊనుగుంటపాలెం సొసైటీకి నల్లపరెడ్డి జగన్మోహన్‌రెడ్డి, సిద్ధవరం సొసైటీకి పాదర్తి కోటేశ్వరరెడ్డి, కొత్తపాలెం సొసైటీకి ఉచ్చూరు రవీంద్రనాథ్‌రెడ్డి, కోట (తిన్నెలపూడి) సొసైటీకి పలగాటి భాస్కర్‌రెడ్డి, చిట్టేడు సొసైటీకి చాపల శ్రీనివాసులును నియమిస్తూ ఉత్తర్వులు అందినట్లు అధికార వర్గాలు తెలిపాయి.

## ఆరోపణలు నిరూపిస్తే పదవికి రాజీనామా చేస్తా : ఎమ్మెల్యే



వెంకటగిరి, జూలై 12 ప్రభాతవార్త : వైసిపి సమన్వ యకర్త నేదురుమల్లి రామ్ కుమార్‌రెడ్డి తనపై చేసిన ఆరోపణలు నిరూపిస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ఛాలెంజ్ చేశారు. వెంకటగిరి పట్టణం 24వార్డు మూలసాల వీధిలో ఎమ్మెల్యే సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆరోపణ నిరూపిం చేందుకు తాను ఎక్కడికైనా వచ్చే ప్రజావేదిక ఏర్పాటు చేస్తానని తెలిపారు. ప్రజలు తనపై ఉన్న నమ్మకంతో తనను మూడుసార్లు గెలిపించాలని తెలిపారు. ఆరు నెలలకు ఒకసారి వచ్చి ఆయన సమావేశాలు పెట్టి వెళ్తున్నట్లు చెప్పారు. మహిళలను అవమానపరుస్తుంటే వారికి రాంకుమార్ రెడ్డి సపోర్ట్ చేయడం మంచి పద్ధతి కాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్రతినెలా ఒకటో తేదీ పింఛన్లను ఇళ్ల వద్దకే వచ్చి ఇస్తున్నట్లు చెప్పారు. కూటమి ప్రభుత్వం ఇప్పుడిప్పుడే రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తున్నట్లు తెలిపారు. స్థానికులు చెప్పిన సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ రాజేశ్వరరావు, పద్మశాలి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గంగాధర్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ రాజేశ్వరరావు, నాయకులు శ్రీనివాసులు, నరసింహులు, రవి, ఆర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

## 15న సుపరిపాలన తొలి అడుగు



గూడూరు, జూలై 12 ప్రభాతవార్త: ఈనెల 15వ తేదీ గూడూరు పట్టణంలో జరిగే సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో రాష్ట్ర ఆర్ అండ్ బి శాఖ మంత్రి జనార్దన్‌రెడ్డి పాల్గొంటారని కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ కోరారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే నాయకులు కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. మంత్రి జనార్ధన్‌రెడ్డి పర్యటనపై చర్చించి, ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈనెల 15వ తేదీ గూడూరు పట్టణంలో జరిగే సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో రాష్ట్ర ఆర్‌అండ్‌బి శాఖ మంత్రి జనార్దన్‌రెడ్డి పాల్గొంటున్నారని అన్నారు నాయకులు తమ ప్రాంతాల్లో ఎక్కడైనా రోడ్ల సమస్య ఉంటే తెలియజేస్తే మంత్రికి తెలుపుతామని వెల్లడించారు. నాయకులు కార్యకర్తలు పాల్గొని మంత్రి పర్యటనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో శీలం కిరణ్ కుమార్, భాస్కర్ రెడ్డి పులిమి శ్రీనివాసులు,వెంకటేశ్వరరాజు దువ్వూరు రాజశేఖర్ రెడ్డి, బిల్లు చెంచురామయ్య, మట్టం శ్రావణి రెడ్డి ఉచ్చూరు వెంకటేశ్వర్ రెడ్డి చిల్లకూరు దశ రామిరెడ్డి విజయ్ భాస్కర్ రెడ్డి, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# నేడు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌ను ప్రారంభించనున్న మంత్రులు



శ్రీకాళహస్తి, జూలై 12 ప్రభాతవార్త: పదేళ్ళ తిరుపతి ఐఐటి ప్రస్థానంలో ఎన్నో మలుపులు, ఎన్నో సామాజిక కార్యక్రమాలు, మరెన్నో విజయాలు, విద్యార్థులకు శిక్షణలు, జాతీయ స్థాయి ప్రసంశలు అందుకుంటుంది. డైరెక్టర్ డాక్టర్ ప్రొ॥ కెయన్ సత్యనారాయణ ఐఐటిని జాతీయ స్థాయిలో శిక్షణలు ఇస్తున్నారు. దశల వారిగా ప్రసంశలందుకుంటున్న ఐఐటి మరో అడుగు ముందుకేసింది. విద్యతో పాటు పారిశ్రామిక రంగంలో ప్రవేశానికి ఓ ప్రయోగం చేసింది. అదే 'ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్'ను ఏర్పాటుకు సిద్ధం చేసింది. ఈ యూనిట్‌ను నేడు కేంద్ర, రాష్ట్ర మంత్రులు ప్రారంభించనున్నారు. ఇందుకు ఏర్పేడు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన తిరుపతి ఐఐటిని ముస్తాబు చేస్తున్నారు.

**జాతీయస్థాయిలో గుర్తింపు:**

తిరుపతి ఐఐటికి కేంద్ర ప్రభుత్వం జాతీయస్థాయిలో పేరెన్నిక గన్న ఐఐటిలతో పాటు గుర్తించి మంజూరౌతున్న ప్రాజెక్టులలో అవకాశం కల్పిస్తుంది. ఎన్నో సెమినార్ల నిర్వహణకు అవకాశం కల్పిస్తున్నారు. నిధుల మంజూరులో ప్రాధాన్యత కల్పిస్తున్నారు. ఈ నేపథ్యంలో దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం 76 కేంద్రాల్లో 'ఫుడ్ ప్రాసెసింగ్ సెంటర్లను' ఏర్పాటుకు అనుమతించింది. ఇందుకు కేంద్రం రూ.2059కోట్లు కేటాయించింది. ఇందులో తిరుపతి ఐఐటికి కూడా అవకాశం కల్పించింది.కేంద్ర ప్రకటిస్తున్న ప్రాజెక్టులను సాధించుకోవటం లోనూ, అలాగే అభివృద్ధికి కేటాయిస్తున్న నిధుల సాధనలో డైరెక్టర్ సత్యనారాయణ ముందు వరుసలో ఉంటున్నారు. ఈ నేపథ్యంలో ' ప్రభుత్వం మంజూరు చేసే ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ సాధనకు ఐఐటిలో రసాయనిక ఇంజనీరింగ్ విభాగాధిపతి ప్రొఫెసర్ కే.యస్. యం. రామారావుతో డైరెక్టర్ పొ.సత్యనారాయణ సమన్వయం చేసుకుంటూ ప్రాజెక్టును తయారు చేసి కేంద్రం నుంచి అనుమతి సాధించారు. సుమారు 90 ఎకరాల స్థలంలో ఈ ప్రాజెక్టును ఏర్పాటు చేయనున్నారు. తిరుపతి ఐఐటిలో నేడు మంత్రులచే ప్రారంభించనున్న ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఓ వైపు మరో వైపు ఐఐటిలో ఎంఎస్.పిహెచ్‌డి కోర్సులు చేస్తున్న విద్యార్థులకు ఫుడ్ ప్రాసెసింగ్ టెక్నాలజీలో ప్రాక్టికల్ శిక్షణ ఉంటుంది. ఇక్కడ తయారైన ఉత్పత్తులను విక్రయించటానికి కేంద్రం ఇప్పటికే ఓసంస్థకు అనుమతించినట్లు సమాచారం అదే 'స్వస్థ' అనే బ్రాండెడ్ సంస్థ అని తెలిసింది.

**నేడు మంత్రుల రాక:**

తిరుపతి ఐఐటిలో ఏర్పాటు చేస్తున్న ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌ను ప్రారంభించటానికి ఆది వారం కేంద్రరాష్ట్ర మంత్రులు హాజరు కానున్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర ఆహార ప్రాసెసింగ్, పరిశ్రమలశాఖ మంత్రి చిరాగ్ పాశ్వాన్, రాష్ట్ర మంత్రి టి.జి భరత్‌లు హాజరు కానున్నారు. ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఇద్దరు మంత్రులు ఐఐటి క్యాంపస్‌ను పరిశీలించనున్నారు.

## హిందువులకు ఒకపవిత్ర గ్రంధం శ్రీమద్భగవద్గీత

### -ధ్వనిముద్రణం ఆవిష్కరణలో వక్తలు



తిరుపతి,జూలై 12ప్రభాతవార్త: శ్రీమద్భగవద్గీత హిందువులకు ఒక పవిత్ర గ్రందమని, భగవంతునిపై భక్తితో పూజించడంవల్ల మోక్షం లభిస్తుందని తెలియజేసే భక్తియోగమని పలువురు వక్తలు తెలిపారు. జ్ఞానాన్ని పొందడం ద్వారా మోక్షం లభిస్తుందని, ధర్మం అంటే ఏమిటో దానిని ఎలా పాటించాలో ఈ గ్రంథం తెలియజేస్తుందన్నారు.గాయకుడు డాక్టర్ గజల్‌శ్రీనివాస్ తన గాత్రంతో ధ్వనిముద్రణం చేసిన "శ్రీమద్భవద్గీత"విడుదల కార్యక్రమం శనివారం సాయంత్రం తిరుపతిలోని కచ్చపి ఆడిటోరియంలో జరిగింది. అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా జడ్జి జస్టీస్ బి.కృష్ణమోహన్, టిటిడి బోర్డుసభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి, స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్‌వి కుమార్, మాజీ టిటిడి చైర్మన్ చదలవాడకృష్ణమూర్తి, మాజీ బోర్డు సభ్యుడు డాక్టర్ హరిప్రసాద్, సంస్కృత విశ్వవిద్యాలయం కులసచివులు ఆచార్య కె.సాంబశివమూర్తి, సభానిర్వహణ డాక్టర్ ఆకెళ్ళ విభీషణశర్మ, అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ అధినేత, కార్యక్రమం సభాధ్యక్షుడు పాండ్ర సురేంద్ర నాయుడు హాజరై శ్రీమద్‌భగవద్గీతపై తమతమ అనుభవాలను అనుగ్రహం చేశారు.

తొలుత జ్యోతిప్రజ్వలనచేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం గజల్ శ్రీనివాస్ స్వయంగా శ్రీవారికి కానుకగా శ్రీమద్‌భగవద్గీత ధ్వనిముద్రణం సమర్పించారు. పలువురు వక్తలు డాక్టర్ గజల్ శ్రీనివాస్ గాయకుడిగా జీవితం, ఆయన అనేక ఆధ్యాత్మిక జీవనశైలి పాటలు, గేయాల గురించి వివరించారు. అనంతరం గజల్‌ను ఘనంగా సన్మానించారు. మహ భారతం ఇతిహాసంలో ఉన్న భగవద్గీత జ్ఞానానికి శాశ్వతమైన నిధిగా అభివర్ణిం చారు. ఇది జీవితం, కర్తవ్యం, విముక్తి మార్గంలో లోతైన అంతర్దృష్టులతో అల్లిన తాత్విక వస్త్రమన్నారు. నేటి తరానికి భగవద్గీత గురించి సవివరంగా తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. కర్మ,యోగం, జ్ఞానయోగం, భక్తియోగం వంటి వివిధ మార్గాల ద్వారా మోక్షాన్ని ఎలా పొందాలో ఇందులో వివరించబడిందన్నారు. మానవుని జీవితంలోని వివిధ సమస్యలకు పరిష్కారాలను అందిస్తుందన్నారు. నైతిక విలువలను బోధిస్తుందన్నారు. సులభంగా వినేందుకు ప్రస్తుతం గజల్ శ్రీనివాస్ తెలుగు, సంస్కృతంలో స్వరపరిచాదన్నారు. గత ఏడాది కాలంగా గజల్ చేస్తున్న కృషికి నిదర్శనమే ప్రస్తుతం తెలుగు, సంస్కృత భాషల్లో మాత్రమే సంపూర్ణ భగవద్గీత విడుదల అయిందన్నారు. చివరగా ఎస్వీ సంగీత నృత్యకళాశాల అధ్యాపకురాలు డాక్టర్ ముద్దుబాల బృందం అష్టలక్ష్మీవైభవమ్ నృత్యప్రదర్శన ప్రేక్షకులను ఆకట్టుకుంది. కరతాళధ్వనులతో చిన్నారులను అభినందించారు.

## యజ్ఞంలా సాగుతున్న నగర సంకీర్తనం



తిరుపతి రవాణ, జూలై 12 ప్రభాతవార్త : భక్తులను, తిరుపతి వాసులను ఆధ్యాత్మికవైపు నడిపించేలా రాయలసీమ రంగస్థలి చేపట్టిన నగరసంకీర్తన ఒక యజ్ఞంలా సాగుతుందని రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి తెలిపారు. వేకువ జామున శనివారం రోజు గోవిందుని నామస్మరణ చేసినా, గోవింద సంకీర్తనలు విన్నా సర్వపాపహరణం అన్నారు. ఆధ్యాత్మిక రాజధాని తిరుపతి నగరంలో మరింత ఆధ్యాత్మిక శోభను తీసుకురావాలన్న సంకల్పంతో భజనమండలి కళాకారులు శ్రీనివాసునికి ఎంతో ప్రీతికరమైన శనివారం రోజున నగరసంకీర్తన చేస్తూ నగరానికి ఆధ్యాత్మికశోభ చేకూరుస్తున్నారన్నారు. అందులో భాగంగా నేటి శనివారం ఉదయం సాంప్రదాయ దుస్తులతో వాయిద్య, భజన సంగీత కళాకారులు గోవింద నామ సంకీర్తనలు ఆలపించారు. వీరితో స్థానిక ప్రజలు,భక్తులు జతకలిశారు. గోవిందనామాలు జపించిన గోవింద సంకీర్తనలు విన్న సర్వపాపాలు హరించి శుభాలు కలుగుతాయని రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి అన్నారు. నగరసంకీర్తనలో భాగంగా మాఢవీధుల్లో గోవింద భజనలు చేశారు. భక్తులకు ప్రసాద వితరణ జరిగింది. ఈ కార్యక్రమంలో బ్రహ్మానందం, గుండాల గోపీనాథ్, రాజశేఖర్‌రెడ్డి, మునినాధరెడ్డి, వాసుదేవరెడ్డి, విక్రమ్‌స్వామి, సురేంద్రరాజు, నరసింహారెడ్డి, కృష్ణమూర్తి ఎడ్డి, కవిత, యశస్విని, పద్మావతి, అరుణ, సిద్ధమ్మ, కళావతి, కల్యాణి, తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి పాల్గొన్నారు.

## ఘనంగా వేదిక్ వర్సిటి 20వ వార్షికోత్సవ వేడుకలు

తిరుపతి విద్య, జూలై 12 ప్రభాతవార్త : టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న శ్రీ వేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయం మరింత అభివృద్ధి చెందేందుకు సమిష్టిగా కృషి చేద్దామని వర్సిటీ అధికారులు పిలుపు నిచ్చారు.వేదిక్ వర్సిటీ సంధ్యావందనశాలలో శనివారం విశ్వవిద్యాలయ 20వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా వైఖానస ఆగమ పౌరోహిత్య విభాగ అధ్యాపకుల ఆధ్వర్యంలో సుదర్శన సహిత పారమాత్మికహోమ కార్యక్రమాని నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని వీసీ ప్రొఫెసర్ సదాశివమూర్తి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ భాస్కరుడు హాజరయ్యారు.హోమ పూర్ణాహుతి అనంతరం వర్సిటీ సంఖాయ ప్రముఖులు బ్రహ్మశ్రీ ఆచార్య గోలి సుబ్రహ్మణ్య శర్మ,ఐకేఎస్ డైరెక్టర్ ఆచార్య తారకరామ కుమారశర్మ మాట్లాడుతూ 2006వ సంవత్సరంలో టీటీడీ సంపూర్ణ సౌజన్యంతో వేదిక్ వర్సిటీ ప్రారంభమైందన్నారు.19 సంవత్సరాల కాలంలో వేద,ఆగమ,పౌరోహిత్య, వేదాంగ,వేద భాష్య, విభాగాలలో సాంప్రదాయ పద్ధతిలో అధ్యయనం,పరిశోధన, ప్రచురణ పెద్ద ఎత్తున జరిపి యూజీసీ గుర్తింపు సాధించడం జరిగిందన్నారు.వర్సిటీలో విద్యనభ్యసించిన విద్యార్థులు దేశ, విదేశాలలో అనేక ధార్మిక సంస్థలలో ఉన్నత పదవులలో రాణిస్తున్నారని తెలిపారు.వర్సిటీలో ప్రవేశాలు పొందిన నూతన విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించడానికి వర్సిటీ అధికారులు, టీటీడీ అధికారులు సంపూర్ణ సహకారం అందించనున్నారని చెప్పారు.శ్రీవారి ఆశ్సీసులతో ఉత్తమ విద్యార్థులుగా రాణించి వర్సిటీకి మంచి పేరుప్రతిష్టలు తీసుకురావాలని కోరారు.అనంతరం వర్సిటీ అధికారులు నూతన విద్యార్థులకు ఉచిత వస్త్ర ప్రసాదం చేశారు.ఈ కార్యక్రమంలో ఫైనాన్స్ అధికారి అంజిరెడ్డి, సంయోజకులు డాక్టర్ భరత శేఖరాచార్యులు, డాక్టర్ నీలకంఠం, సత్యనారాయణాచార్యులు,డాక్టర్ భావనారాయణా చార్యులు, డాక్టర్ టి బ్రహ్మాచారులు, అధ్యాపకులు,సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

## అంత్యక్రియల్లో మండల టిడిపి నాయకులు



పెళ్లకూరు జూలై 12 ప్రభాతవార్త: మండలంలోని పెన్నేపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచు, టీడీపీ నాయకుడు కోవూరు ఏడుకొండలు (47) గుండెపోటుతో శుక్రవారం మృతిచెందగా టీడీపీ మండల అధ్యక్షులు సంచి కృష్ణయ్య యాదవ్ టీడీపీ నాయకులతో కలసి గ్రామంలోనే ఉండి అంత్యక్రియలు ముగిసేవరకు అంతా తానై కార్యక్రమం నిర్వహించారు. తనకు అత్యంత సన్నిహితుడు కావడంతో ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ పునబాక పోలయ్యతో కలసి ఏడుకొండలు పాడె మోశారు. అదే గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ టిడిపి నాయకుడు గాలి రమేష్ నాయుడు పదివేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు అనంతరం తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు స్వర్ణముఖి నది ఆనకట్ట ప్రాజెక్ట్ కమిటీ మాజీ చైర్మన్ పేరం రమేష్ నాయుడు ఉమ్మడి నెల్లూరు జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు కందమూడి శివకుమార్ ఆ పార్టీ నాయకులు శ్రీనివాసులు నాయుడు కలవకోలు మునీష్ తో కలిసి ఏడుకొండల మృతదేహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.

## వృద్ధాశ్రమంలో అన్నదానం



గూడూరు, జూలై 12 ప్రభాతవార్త: పట్టణంలోని ఓం శ్రీ సాయిరాం వృద్ధాశ్రమం నందు ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దాతలుగా మెడనూరు సురేష్‌రెడ్డి, శాంతి దంపతులు వ్యవహరించారు. డాక్టర్ రోహిణి మాట్లాడుతూ ప్రగతి సేవా సంస్థ సేవలు అభినందనీయమన్నారు. దాతల సహకారం మరువలేనిదన్నారు, ప్రతి ఒక్కరు సేవా దృక్పధాన్ని అలవరచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్, బండి ధనుంజయ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదు



నాయుడుపేట, జూలై 12 ప్రభాతవార్త : సూళ్ళూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవ య్యపై నాయుడుపేట మున్సిపాల్టి వైస్‌చేర్మేన్ 786రఫి అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని కౌన్సిలర్లు పాలేటి నాగార్జున తీవ్రంగా ఖండించారు. మున్సి పాల్టీ కౌన్సిలర్లు నాగార్జున మాట్లడుతూ నీకురాజక్రీయ బిక్షపెట్టిన సంజీవ నన్ను మరచిపోయి ఇష్టం వచ్చినట్లు మాట్లడు తున్నావు తగిన మూల్యం చెల్లించుకొనే రోజులు దగ్గర పడ్డాయన్నారు. సంజీవన్న సాయంతోనే నువ్వు నాయుడుపేటలో రాజక్రీయంగా ఎదిగి పట్టణ అధ్యక్షుడు,మున్సిపాల్టి వైస్‌చేర్మేన్ అనేకపదవులు పొంది ఆయన్నే విమర్శించే అర్హత నీకులేదన్నారు. నోరుందని ఇష్టం వచ్చినట్లు సంజీవన్నను మాట్లడితే ఊరుకొనేదిలేదని ఆయన హెచ్చరించారు. ఈకార్యక్రమంలో కౌన్సిలర్లు దారా రవి, షబ్బీర్, అశోక్, జయనామయ్య తదితరులు ఉన్నారు.

## మంత్రిని సన్మానించిన బిజేపి నాయకులు



నాయుడుపేట, జూలై 12 ప్రభాతవార్త : రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌ను నాయుడు పేటకు చెందిన బిజేపి నాయకులు శనివార ం ఘనంగా సన్మానించారు. ధర్మవరం పోలీస్ గెస్ట్ హౌస్‌లో ఉన్న మంత్రి సత్యకుమార్‌ను నాయుడు పేట బార్‌అసోషియేషన్ అధ్యక్షుడు ఆశా చెంచు కృష్ణయ్య, బొల్లకాయల విజయ భాస్కర్‌లు మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం నాయుడుపేటకు చెందిన బిజేపి నాయకులు ఆశా చెంచుకృష్ణయ్య మంత్రి సత్యకుమార్‌కు పూల మాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. అందుకు స్పందించిన మంత్రి సత్యకుమార్ తిరుపతిజిల్లా కలెక్టర్‌తో చర్చించి రైతులకు న్యాయం చేస్తామని హామి ఇచ్చినట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట కొప్పాల సుబ్రమణ్యం,పుట్టు వీరయ్యలు ఉన్నారు.

## అటవీ సరిహద్దుల్లో ఆరు ఏనుగుల సంచారం

రామకుప్పం, జూలై 12 ప్రభాతవార్త : మండలంలోని నారాయణపురం తాండా అటవీ ప్రాంతంలోని చీకలగట్టు ప్రాంతంలో ఆరు ఏనుగులు సంచరిస్తున్నటు అటవీ అధికారులు తెలిపారు. దీంతో రామాపురం తాండా, నారాయణపురం తాండా, కోటచేను, ననియాల తాండా, జీడిమాకులపల్లి గ్రామాల ప్రజలు రాత్రిపూట ఎవరూ అడవిలోకి, పొలాల వద్దకు వెళ్లరాదని హెచ్చరించారు. ఏదేని సమాచారం ఉంటే అటవీ అధికారులకు 6301667521, 9966238653 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

## మీ క్రీడా నైపుణ్యం అమూల్యం

### -టిటిడికి ఇదో గొప్పగౌరవం -విఎస్ఓలకు టిటిడి చైర్మన్ నాయుడు అభినందనలు



తిరుమల,జూలై 12ప్రభాతవార్తప్రతినిధి: అంతర్జా తీయ స్థాయిలో ప్రపంచ పోలీస్, ఫైర్ గేమ్స్-2025 పోటీల్లో ప్రతిభకనబరిచి కాంస్య, స్వర్ణపతకాలు అందుకోవడం టిటిడికి గొప్ప గౌరవంగా నిలిచిందని టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడు అన్నారు. పోలీసు క్రీడల్లో టిటిడి విజిలెన్స్ సెక్యూరిటీ విభాగం నుండి పాల్గొని విఎస్‌ఓలు (వింగ్) ఎన్వీవి రామ్‌కుమార్, అల్లం సురేంద్ర సింగిల్ టెన్నిస్ పోటీల్లో అద్భుతంగా ఆడారని అభినందించారు. శనివారం తిరుమల లోని చైర్మన్ క్యాంపు కార్యాలయంలో ఇద్దరు విఎస్‌ఓలు చైర్మన్ నాయుడును కలసి తమ పతకాలను చూపారు.

## శివయ్య సేవలో ఎనమల కుటుంబం



శ్రీకాళహస్తి,జూలై 12 ప్రభాతవార్త : రాష్ట్ర మాజీ ఆర్థిక శాఖ మంత్రి యనమల రామకృష్ణుడు, ప్రభుత్వ విప్,తుని శాసనసభ్యులు యనమల దివ్యలు శనివారం వాయులింగేశ్వరుని దర్శనానికి వచ్చారు. వారికి ఆలయ కార్యాలయం వద్ద సాదరంగా శాసనసభ్యుడు బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి తెలుగుదేశం కుటుంబ సభ్యులు స్వాగతం పలికారు. దక్షిణ గోపురం వద్ద ఆలయ మర్యాదలతో ఆలయ ఇఓ డి.బాపిరెడ్డి,ఎఇఓ మోహన్, పిఆర్‌ఓ రవి,టెంపుల్ ఇన్సెపెక్టర్ వెంకటస్వామి, సుదర్శనంలు స్వాగతం పలికారు. స్వామి అమ్మవార్ల వేదపండితులతో ఆశీర్వదించి ఎంఎల్ఏ దంపతులు సుధీర్‌రెడ్డి, రిషితారెడ్డిలు స్వామి అమ్మవార్ల చిత్రపటాలను అందించారు.

## శివయ్యసేవలో గనుల శాఖామాత్యులు



శ్రీకాళహస్తి,జూలై 12 ప్రభాతవార్త: దక్షిణ కైలాసంగా విరాలజిల్లుతున్న శ్రీకాళహస్తీశ్వరుని సన్నిధిలో పలువురు మంత్రులు, ఉన్నతాధికారులు వాయు లింగేశ్వరుని దర్శించుకొని రాహుకేతుదోష నివారణ పూజలు జరిపించుకుంటున్నారు. మంత్రికి దక్షిణ గోపురం వద్ద ఆలయ మర్యాదలతో ఆలయ ఇఓ డి.బాపిరెడ్డి ఎఇఓ మోహన్, పిఆర్‌ఓ రవిలు స్వాగతం పలికారు. స్వామి అమ్మవార్ల చిత్రపటాలను తీర్థ ప్రసాదాలను ఇఓ బాపిరెడ్డి అందించారు.ఏర్పాట్లనుటెంపుల్‌ఇన్సెపెక్టర్లు వెంకటస్వామి,సుదర్శనంనాయుడు పర్యవేక్షించారు.

## టిటిడి ఆలయాలను అభివృద్ధి చేయండి

### -టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడును కోరిన ఎమ్మెల్యే పులివర్తి నాని



తిరుపతిరూరల్, జూలై 12 ప్రభాతవార్త: చంద్రగిరి నియోజకవర్గం పరిధిలో ఉన్న టిటిడి ఆలయాలు, కళ్యాణ మండపాలను అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే పులివర్తి నాని టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడును కోరారు. ఈ మేరకు శనివారం క్యాంప్ కార్యాలయంలో టిటిడి చైర్మెన్‌ను కలిసి పలు అంశాలపై చర్చించారు. ముఖ్యంగా శ్రీవారి మెట్టు మార్గాన వచ్చే భక్తులకు సేద తీరడం కోసం చంద్రగిరి మండలంలో నూతన వసతి సముదాయాలు ఏర్పాటు చేయాలని కోరారు. చంద్రగిరి నియోజకవర్గ ప్రజలకు నెలలో ఒకరోజు శ్రీవారి దర్శనం కల్పించాలని కోరారు.

## ఆణివార ఆస్థానానికి...15న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

### -15,16బ్రేక్ దర్శనాలు రద్దు

తిరుమల,జూలై 12ప్రభాతవార్తప్రతినిధి: ఆపదమొక్కులవాడి ఆలయంలో సాలకట్ల ఆణివార ఆస్థానం పర్వదినం సందర్భంగా 15వతేదీ మంగళవారం ఉదయం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం చేపడతారు. ఆలయ అర్చకులు, అధికారులు మహాయజ్ఞంలా ఈ కార్యక్రమంలో పాల్గొని ఆలయం అంతటా సుగంధ పరిమళ ద్రవ్యంతో శుద్ధి చేయనున్నారు. ఆలయంలోపల బంగారు వాకిలి నుండి ఉప ఆలయాలు, మహద్వారం వరకు నీటితో శుభ్రం చేయనున్నారు. అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరిపసుపు, పచ్చాకు, గడ్డకర్పూరం,గంధంపొడి, కుంకుమ, కిచిలిగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పరిశ్ర పరిమళ జలాన్ని ఆలయమంతటా సంప్రోక్షణ చేస్తారు, 16వతేదీ ఆలయంలో ఆణివార ఆస్థానం జరగనుంది. గతంలో వార్షిక లెక్కలు చూసేరోజుగా పరిగణించేవారు. ఈ ఉత్సవాన విశేష కార్యక్రమాలు ఉంటాయి. మంగళవారం అష్టదళపాదపద్మారాధనసేవ రద్దయ్యింది.